RNI No: TELTEL/2013/50413
సంపుటి: 13, సంచిక: 94

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

బుధవారం
21.01.2026
హైదరాబాద్

www.mudranews.in
www.youtube.com/@MudraNews
www.instagram.com/mudradaily
www.x.com/MudraDaily

పేజీలు: 12
వెల: ₹5

Published From: Hyderabad | Amaravathi | Vijayawada

## మేడారం జాతరకు 4,000 బస్సులు

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ పక్కా ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి సుమారు 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీని ఆశ్రయిస్తారనే అంచనాతో రికార్డు స్థాయిలో 4,000 బస్సులను నడుపుతున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సెక్రటేరియట్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. 05




- భక్తులకు ఇబ్బందులు కలగకుండా పక్కా ప్రణాళిక
- క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షించాలి
- ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం
- గతంలో 3,491 బస్సులు నడపగా, ఈసారి 4,000 బస్సుల కేటాయింపు
- జాతర రూట్లలో హోర్డింగ్స్, ప్రచార మాధ్యమాల ద్వారా భారీగా అవగాహన
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూట్లు, ఈవీ బస్సులు, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

## కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చినా భయపడం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 09

- న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉంది
- ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు, సుప్రీంకోర్టులు కొట్టేశాయి
- అయినా కాంగ్రెస్ సిట్ తో విచారణ జరుపుతూ వేధిస్తోంది
- రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి కోల్ టెండర్లు అప్పజెప్పే ప్రయత్నం
- నాయకులతో కలిసి మీడియా మీట్ లో కేటీఆర్





## చాణక్య దౌత్యం

యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్‌కు మోడీ స్వయంగా స్వాగతం

- రెండు గంటల భేటీ.. గ్లోబల్ సంక్షోభాలపై రహస్య చర్చలు
- గల్ఫ్ దేశాలతో భారత్‌కు బలమైన ఆర్థిక బంధం
- ఐఎంఈసీతో చైనా ఆధిపత్యానికి చెక్
- అబుదాబి ఆయిల్ క్షేత్రాలపై భారత్ దృష్టి

03

## హైటెన్షన్

- గంటల తరబడి హరీష్ రావు విచారణ
- బీఆర్ఎస్ ఆందోళన
- గతంలోనే ఇదే కేసులో ఊరట
- మళ్లీ నోటీసులిచ్చి విచారణకు పిలిచిన సిట్
- అధికార, విపక్షం మధ్య రాజుకున్న నిప్పు

09





ట్రెండ్ ఫాలో అవుతాడా? సెట్ చేస్తాడా?

# CM దావోస్ టూర్

### పెట్టుబడులే లక్ష్యంగా వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి

- మాస్ & క్లాస్ కలిపిన లుక్
- ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంగా..
- విజన్ 2047 టార్గెట్
- గ్లోబల్ బ్రాండ్ తెలంగాణ
- స్టైల్ ఐకాన్ గా సీఎం
- పారిశ్రామికాభివృద్ధి కోసం ప్రయత్నాలు
- స్విట్జర్లాండ్‌లో తెలంగాణ సందడి
- యూత్ ఫుల్ లీడర్ షిప్

02

దావోస్ లో జరుగుతన్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ ప్రతినిధి బృందం పెట్టుబడుల వేటను వేగవంతం చేసింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం పలు అంతర్జాతీయ సంస్థలు, దేశాలతో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యంగా 'భారత్ ఫ్యూచర్ సిటీ' అభివృద్ధికి యూఏఈ ప్రభుత్వం మద్దతు ప్రకటించగా, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఏటా 5 వేల మందికి ఉపాధి కల్పించేందుకు సౌదీకి చెందిన 'ఎక్స్‌పర్టైజ్' సంస్థ ముందుకొచ్చింది. ఏఐ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో రాయల్ ఫిలిప్స్ సంస్థతో భాగస్వామ్యం కుదరడంతో పాటు, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యం దిశగా ఈ పర్యటన కీలక మైలురాయిగా నిలిచింది.

ముద్ర, తెలంగాణ బ్యూరో:

## తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం అవ్వండి

02

సీఎంకు తోడుగా శ్రీధర్ బాబు కీలక పాత్ర
రాష్ట్ర వ్యవహారాలు, పెట్టుబడుల్లో క్రియాశీలం..

మంత్రి శ్రీధర్ బాబు






## బండి తాళాలు లాగేసుకోవద్దు

పెండింగ్ చలాన్ల విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- స్వచ్ఛందంగా చెల్లిస్తేనే వసూలు చేయాలి
- చెల్లించకపోతే నోటీసులు ఇవ్వాలని వ్యాఖ్యానించిన హైకోర్టు

09



## డెమోక్రసీకి సవాల్ విసురుతున్న కార్పొరేట్ శక్తులు

ఖమ్మం సీపీఐ జాతీయ సెమినార్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

- ఫాసిస్టులు, క్యాపిటలిస్టులకు వ్యతిరేకంగా పోరాటాలు చేద్దాం
- తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికి కొత్త సందేశాన్ని ఇచ్చింది

09

## దావోస్ లో ఏపీ సీఎం బిజీ

### రెండో రోజు హడావుడిగా కనిపించిన చంద్రబాబు

ఐబీఎం, గూగుల్ క్లౌడ్ వంటి సంస్థల ప్రతినిధులతో భేటీలు
ఏపీ బ్రాండ్ ఇమేజ్ మరింత పెంచేలా రౌండ్ టేబుల్ సమావేశాలు

10

ముద్ర, తెలంగాణ బ్యూరో:

దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం పర్యటన రెండో రోజు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటారు. పెట్టుబడుల ఆకర్షణ, ఆధునిక సాంకేతికత, ఏఐ, గ్రీన్ ఎనర్జీ వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. ఉదయం సీఐఐ బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో 'ది ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్' అంశంపై ప్రసంగించనున్నారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా ఎదిగిన విధానం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పోర్ట్ ఆధారిత అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, మానవ వనరుల నైపుణ్యంపై వివరించనున్నారు. ఆ తర్వాత జరిగే ఇండియా లౌంజ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని, ప్రపంచ పెట్టుబడిదారులతో పరస్పర చర్చలు జరపనున్నారు. అనంతరం దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం చైర్మన్ సీఈఓ అరవింద్ కృష్ణతో భేటీ అవుతారు. గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తోనూ సీఎం సమావేశం కానున్నారు.



## జగిత్యాల ఆసుపత్రికి కొత్త ఊపిరి

06

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

రూ.235 కోట్లతో 450 పడకల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన
రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భారీ నిధులు, పేదలకు నాణ్యమైన వైద్యం లక్ష్యం
క్రిటికల్ కేర్ భవనం ప్రారంభించిన మంత్రి





# దావోస్ లో కీలక ఒప్పందాలు

- పలు అంశాలను వివరించిన రైజింగ్ టీం
- యంగ్ ఇండియాకు సౌదీ ఇంట్రెస్ట్
- ఏఐతో భాగస్వామ్యానికి రాయల్ ఆసక్తి
- ఫ్యూచర్ సిటీకి యూఏఈతో ఒప్పందం

**ముద్ర, హైదరాబాద్ :**




తెలంగాణ రైజింగ్ బృందానికి దావోస్ టూర్ కలిసి వస్తోంది. ఈ సందర్భంగా పలు రంగాల్లో ఒప్పందాలు కుదురుతున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హెచ్.ఈ. అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక -2026 సదస్సులో భాగంగా దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డితో యూఏఈ మంత్రి మంగళవారం భేటీ అయ్యారు. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు.భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇది దేశంలోనే తొలి నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల్లో విస్తరించే ఈ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ లో ఇప్పటికే మారుబేని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని, ఇటీవలే రిలయన్స్ గ్రూప్ వంతారాతో ఫ్యూచర్ సిటీలో కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సీఎం వెల్లడించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రాజెక్ట్ వేగవంతమయ్యేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సౌదీ సంస్థ ఆసక్తి**

సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్ పర్టైజ్' స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యమయ్యేందుకు ఆసక్తి వ్యక్తం చూపింది. సంస్థ ప్రెసిడెంట్ ,సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్, దావోస్‌లో 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థకు ఉద్యోగ అవకాశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, ప్రాక్టికల్ శిక్షణ అందించడమే స్కిల్ యూనివర్సిటీ ప్రధాన ఉద్దేశమన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 2047 విజన్‌కు అనుగుణంగా తెలంగాణను భవిష్యత్‌కు సిద్ధమైన ప్రతిభా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రాథమిక విద్య, ఆధునిక నైపుణ్యాలు, శిక్షణ, మెంటార్‌షిప్ ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం సాధించడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. భారతదేశంలో పూర్తిగా పరిశ్రమల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న తొలి విశ్వవిద్యాలయం స్కిల్ యూనివర్సిటీయే నని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ పర్టైజ్ సంస్థ సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా సుమారు 5వేల మంది నైపుణ్య కలిగిన సిబ్బందిని నియమించుకునే అవసరం తమకు ఉందని, ఆ అవసరాలను తీర్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యం చేసుకోవాలని ప్రతిపాదించారు. అవసరమైన అన్ని విభాగాల్లో శిక్షణను యూనివర్సిటీ తో కలిసి ప్రారంభించాలనుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో ఈ సంస్థ, పెట్రో కెమికల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎరువులు, స్టీల్, సిమెంట్, వాటర్ ట్రీట్‌మెంట్, విద్యుత్ ఉత్పత్తి వంటి నైపుణ్యాధారిత రంగాల్లో ప్లాంట్ నిర్వహణ సేవలను అందిస్తోంది.

**ఇది ప్రశంసనీయం : రాయల్ ఫిలిప్స్**

రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్-స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో తెలంగాణ చేపడుతున్న ఏఐ ఆధారిత మార్పు అత్యంత ప్రశంసనీయమని అన్నారు. తమ నెదర్లాండ్స్ ప్రధాన కార్యాలయాన్ని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సందర్శించాలని ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు.

**హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు అవకాశాలపై యూనిలీవర్ పరిశీలన**

**దావోస్‌లో తెలంగాణ రైజింగ్ బృందంతో యూనిలీవర్ ఉన్నతాధికారుల భేటీ**

ప్రపంచ వ్యాప్తంగా వస్తు వినియోగరంగంలో అగ్రగామిగా ఉన్న యూనిలీవర్ సంస్థ, హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేసే అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేసింది. ప్రపంచ ఆర్థిక వేదిక (WEF)-2026 సదస్సులో భాగంగా మంగళవారం దావోస్‌లో, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం యూనిలీవర్ చీఫ్ సప్లై చైన్ అండ్ ఆపరేషన్స్ ఆఫీసర్ విల్లెమ్ ఉయిజెన్‌తో సమావేశమైంది. తెలంగాణలో జీసీసీ ఏర్పాటు అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రంగా హైదరాబాద్ వేగంగా మారుతుందని వివరించారు. దీనిపై స్పందించిన విల్లెమ్ ఉయిజెన్ హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు అవకాశాలను తమ సంస్థ సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇప్పటికే మెక్‌డొనాల్డ్స్, హైనెకెన్, కాస్టకో వంటి ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ (త్వరగా వినియోగ వస్తువుల) సంస్థల జీసీసీలు విజయవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. తెలంగాణకు యూనిలీవర్ విలువైన భాగస్వామి అని, వేగవంతమైన అనుమతులు, లైసెన్సింగ్ ప్రక్రియలతో తెలంగాణ వ్యాపారాలకు అనుకూల రాష్ట్రంగా నిలుస్తోంది అని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా తెలంగాణ రైజింగ్ బృందం, తెలంగాణలోని పారిశ్రామిక పార్కుల్లో త్వరగా వినియోగ వస్తువుల (ఎఫ్‌ఎంసీజీ) తయారీ రంగంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని యూనిలీవర్‌ను ఆహ్వానించారు. వాతావరణ పరిరక్షణ, నీటి వినియోగంలో సానుకూలత, ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి యూనిలీవర్ లక్ష్యాలను, తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న పునరుత్పాదక శక్తి, నీటి సంరక్షణ, సర్క్యులర్ ఎకానమీ కార్యక్రమాలతో అనుసంధానం చేసే అంశాలపై కూడా చర్చలు జరిగాయి.

### వేగంగా అభివృద్ధి : సీఎం

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఔషధ తయారీ, పరిశోధనాభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగాల్లో ప్రపంచ స్థాయి, స్థిరమైన పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ (ORR) , రీజినల్ రింగ్ రోడ్ (RRR) మధ్యనున్న ప్రాంతంలో పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ (PURE) తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కొత్త లైఫ్ సైన్సెస్ విధానం, ఔషధ తయారీ వ్యూహాలు కలిసి తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పునాది వేస్తాయని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, బలమైన ఐటీ-లైఫ్ సైన్సెస్-హెల్త్‌కేర్ టాలెంట్ బేస్, జీనోమ్ వ్యాలీ, 300 ఎకరాలకు పైగా విస్తరించిన మెడికల్ డివైసెస్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఉన్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ వైద్య పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇక్కడి ఆస్పత్రులు ఇప్పటికే క్రిటికల్ కేర్, అంబులెన్స్ సేవలు వంటి రంగాల్లో ఏఐను సమర్థవంతంగా వినియోగిస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఏఐకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. "ఇదే సరైన సమయం. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయడానికి ఇది ఉత్తమ అవకాశమని" మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు వచ్చి.. జీనోమ్ వ్యాలీని సందర్శించాలని మంత్రి ఫిలిప్స్ నాయకత్వాన్ని ఆహ్వానించారు.

### ఏఐ రంగంలో రాయల్ ఫిలిప్స్ ఆసక్తి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్యమయ్యేందుకు ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి వ్యక్తం చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై కూడా చర్చించేందుకు ముందుకొచ్చింది.తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఫిలిప్స్ గ్లోబల్ నాయకత్వంతో భేటీ అయ్యారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ , గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్- స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఏఐ రంగంలో తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత సేవలపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'తెలంగాణ నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030' గురించి ప్రతినిధి బృందం వివరించింది. 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించడమే ఈ విధాన లక్ష్యమని, మెడికల్ ఎలక్ట్రానిక్స్ సహా అనుబంధ రంగాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు.

### తెలంగాణతో భాగస్వామ్యానికి గూగుల్ ఆసక్తి

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లలో భాగస్వామ్యం పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో సీఎం రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఏపీఏసీ) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. ప్రధానంగా వాతావరణంలో పెను మార్పులు, వ్యవసాయంపై దాని ప్రభావం, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యల పరిష్కారాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి నమూనాను వివరించారు. కోర్ హైదరాబాద్ సిటీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలను వివరించారు. ట్రాఫిక్ కంట్రోల్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్‌కు మరింత మద్దతు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తొలి గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినందుకు గూగుల్ బృందానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎరువుల అతిగా వినియోగంతో ఏర్పడుతున్న సమస్యలు, రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరంపై ప్రతినిధుల బృందం చర్చించింది. సమస్యల పరిష్కారానికి, సమస్యలు తలెత్తకుండా నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్ స్పష్టం చేశారు. గూగుల్ ఏపీఏసీ ప్రెసిడెంట్ శ్రీ సంజయ్ గుప్తా మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లు మరియు వాతావరణ మార్పు అంశాల్లో తెలంగాణకు పూర్తి స్థాయిలో మద్దతు అందించేందుకు గూగుల్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విస్తృత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, బీఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలాతో భాగస్వామ్యం, ఏఐ పాఠ్యాంశాల అమలును ప్రధానంగా ప్రస్తావించారు. ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా, టీ ఫైబర్ ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ అందిస్తుందని వివరించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---

# తెలంగాణ రైజింగ్"లో భాగస్వామ్యం అవ్వండి...

- 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్నదే మా సంకల్పం
- పారిశ్రామికాభివృద్ధికి అవకాశాలు పుష్కలం, పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం
- పెట్టుబడులు పెట్టండి... రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకోండి
- "ఇండియా పెవిలియన్" ప్రారంభోత్సంలో దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించిన మంత్రి శ్రీధర్ బాబు

**ముద్ర, హైదరాబాద్ :**




"ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"లో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచిన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి "తెలంగాణ రైజింగ్"లో భాగస్వామ్యం కావాలని దిగ్గజ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణతో కలిసి పని చేసేందుకు.... రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకునేందుకు ముందుకు రావాలని వారిని సాదరంగా ఆహ్వానించారు. మంగళవారం వరల్డ్ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో భాగంగా దావోస్ లో ఏర్పాటు చేసిన "ఇండియా పెవిలియన్" ప్రారంభోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానిని నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని.... అందుకు అనుగుణంగా దార్శనికతతో కూడిన ప్రణాళికా బద్ధమైన అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా నిపుణులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల భాగస్వామ్యంతో కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేశామన్నారు. ఈ విజన్ డాక్యుమెంట్ లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే కీలక రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, హెల్త్ కేర్ ఇన్నోవేషన్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్, హార్డ్ వేర్ మాన్యుఫ్యాక్చరింగ్, ఐటీ, ఐటీఈఎస్, ఏరో స్పేస్, డిఫెన్స్, టెక్స్‌టైల్, అప్పారెల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్, రెన్యువబుల్ ఎనర్జీ, గ్రీన్ టెక్నాలజీస్ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలు, అవకాశాలు, ఇక్కడి ఎకో సిస్టం గురించి వివరించారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. దావోస్ వేదికగా తమ ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించిందన్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో పారిశ్రామికాభివృద్ధికి ఉత్తమిచ్చేలా రూపొందించిన పాలసీలను వివరించి, దిగ్గజ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. "తెలంగాణ బ్రాండ్" మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ (టీఏఐహెచ్) ను దావోస్ వేదికగా లాంఛనంగా ఆవిష్కరిస్తామన్నారు.

---

# కమల దళపతిగా నితిన్ నబీన్

- సాధారణ కార్యకర్త నుంచి కమల దళపతిగా
- 45 ఏళ్లకే బీజేపీ జాతీయ అధ్యక్షుడైన నితిన్ నబీన్
- "నేను కార్యకర్తనే... నితిన్ నా బాస్" అధ్యక్ష పదవిపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- యువతకు పెద్ద పీట – కుటుంబ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా బీజేపీ ప్రయాణం
- చత్తీస్‌గఢ్ విజయమే టర్నింగ్ పాయింట్..నబీన్‌పై జాతీయ నాయకత్వం నమ్మకం
- బెంగాల్ నుంచి దక్షిణం వరకూ భారతీయ జనతా పార్టీ ఎన్నికల భవితవ్యం నబీన్ చేతుల్లో

**ముద్ర, ఢిల్లీ ప్రతినిధి :**



బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నితిన్ నబీన్.. జెపీ నడ్డా నుంచి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజానాథ్ సింగ్, పలు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. బీజేపీలో సాధారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడు కాగలడని.. ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయన్నారు. "నేను బీజేపీ కార్యకర్త.. నితిన్ నాకు బాస్. బీజేపీలో నిర్ణయాలు, ఎంపికలు అన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఉంటాయి. దేశ సేవ, ప్రజాసేవే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోంది" అని మోదీ పేర్కొన్నారు."ప్రభుత్వానికి అధిపతి అయినా... బీజేపీ కార్యకర్త కావడమే నాకు గర్వ కారణం. పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను నితిన్ నబీన్ విజయవంతంగా నిర్వహించారు. తనను తాను రుజువు చేసుకున్నారు. పార్టీ కంటే, దేశం ముఖ్యమనే నినాదంతో పనిచేస్తున్నాం. కుటుంబ రాజకీయ పార్టీలు యువకులకు తలుపులు మూసేస్తున్నాయి. ఇలాంటి రాజకీయ నేపథ్యం లేని లక్ష మంది యువకులను రాజకీయ నాయకులను తయారు చేయాలనుకుంటున్నాను. బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల కోసం పనిచేస్తుంది. మోదీకి అనుకూలంగా వార్తలు రాసినా, చెప్పినా వారిని అర్బన్ నక్సల్స్ టార్గెట్ చేస్తున్నారు. అర్బన్ నక్సలైట్ల ఆగడాలను అరికట్టాలి. కాంగ్రెస్ పార్టీ అధోగతికి ఆ పార్టీ విధానాలు కారణం. కుటుంబ రాజకీయాలే కాంగ్రెస్ పార్టీ కొంప ముంచాయి. కాంగ్రెస్ లక్షణాలు మన పార్టీకి అంటకుండా జాగ్రత్తపడాలి" అంటూ మోదీ వ్యాఖ్యానించారు. కాగా, 26 ఏళ్లకే ఎమ్మెల్యే. 45వ ఏటే బీజేపీ వంటి అతి పెద్ద పార్టీకి జాతీయ అధ్యక్షుడు. ఆ ఘనత సాధించిన అతి పిన్న వయస్కునిగా రికార్డు. నితిన్ నబీన్ రాజకీయ ప్రస్థానం తొలినుంచీ ఆసక్తికరమే. ఆయన ఎన్నికతో బీజేపీ పగ్గాలు రెండో తరం చేతికి అందినట్టయింది.నిజానికి బీజేపీలో జాతీయ స్థాయి ప్రముఖ నేతల జాబితాలో నబీన్ పేరు ఎప్పుడూ పెద్దగా లేదు. అలాంటి నేతలకు ఏకంగా అధ్యక్ష పగ్గాలు అందడం అనూహ్యమనే చెప్పాలి. నబీన్ జన్మించింది బీజేపీ పురుడు పోసుకున్న 1980లోనే కావడం విశేషం. ఆయన జార్ఖండ్‌లోని రాంచీలో జన్మించారు. ఆయన కాయస్థ కులస్తుడు. యువకుడే అయినా పాలన, పార్టీ సంస్థాగత నిర్మాణ వ్యవహారాలు తదితరాల్లో అపార అనుభవం ఆయన సొంతం. నబీన్ రాజకీయ ప్రస్థానం బీజేపీ యువజన విభాగమైన యువమోర్చాతో మొదలైంది. నబీన్ కుటుంబానికి ఆరెస్సెస్‌తో సన్నిహిత బంధముంది. ఆయన తండ్రి నబీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కూడా బీజేపీ నాయకుడే. పట్నా వెస్ట్ ఎమ్మెల్యేగా ఉంటూ 2006లో మరణించారు. దాంతో జరిగిన ఉప ఎన్నికలో నబీన్ ఏకంగా 60 వేల ఓట్ల మెజారిటీతో నెగ్గారు. అప్పటినుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు! 2023లో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సహ ఇన్‌చార్జిగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ పార్టీని విజయపథంలో నడిపి జాతీయ నాయకత్వాన్ని మెప్పించారు.తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఛత్తీస్‌గఢ్‌లో 11 స్థానాలకు గాను బీజేపీ ఏకంగా 10 సీట్లు నెగ్గేలా చేశారు. బీజేపీ అధ్యక్ష పదవికి నడ్డా వారసునిగా పలువురు ప్రముఖుల పేర్లు వినిపించినా, పార్టీ నాయకత్వం మాత్రం అనూహ్యంగా నబీన్ వైపు మొగ్గింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



# మోడీ 'చాణక్య' దౌత్యం

- యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ కు మోడీ స్వయంగా స్వాగతం
- రెండు గంటల భేటీ.. గ్లోబల్ సంక్షోభాలపై రహస్య చర్చలు
- గల్ఫ్ దేశాలతో భారత్‌కు బలమైన ఆర్థిక బంధం
- ఐఎంఈసీతో చైనా ఆధిపత్యానికి చెక్
- అబుదాబి ఆయిల్ క్షేత్రాలపై భారత్ దృష్టి



**న్యూఢిల్లీ:**

మారుతున్న ప్రపంచ రాజకీయాలను నిశితంగా గమనిస్తున్న భారత్.. మరోవైపు పొరుగుఉన్న ఉన్న శత్రు దేశాలు అయిన పాకిస్తాన్, చైనా విషయంలోనూ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇక చిన్న పెద్ద అని తేడా లేకుండా భవిష్యత్ అవసరాల దృష్ట్యా భారత ప్రధాని పలు దేశాల్లో పర్యటిస్తున్నారు. కీలక వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. భారత వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. ఈ క్రమంలోనే బ్రిటన్, ఆస్ట్రేలియాలో కొత్త వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా ఓ విశిష్ట అతిథి భారత పర్యటనకు వచ్చారు. ప్రధాని మోదీ స్వయంగా ఎయిర్ పోర్టుకు వెళ్లి స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి ఒకే కారులో ప్రయాణించడం ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఆ విశిష్ట అతిథి యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్. మోదీ జాయెద్ ఆత్మీయ ఆలింగనం, ఒకే వాహనంలో ప్రయాణం గతంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాత్రమే సాగింది.

**2 గంటల పర్యటన కీలక చర్చలు..**

యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ సోమవారం (జనవరి 19న) భారత్‌లో కేవలం రెండు గంటలు మాత్రమే పర్యటించారు. ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు, యెమెన్ సంక్షోభం, గాజా అశాంతి నేపథ్యంలో మోదీతో కీలక చర్చలు జరిపినట్లుల తెలిసింది. అయితే అధికారికంగా మాత్రం చర్చల వివరాలు వెల్లడించలేదు.

**గల్ఫ్ దేశాలతో బలమైన భాగస్వామ్యం**

యూఏఈ, సౌదీ, కతార్ వంటి దేశాలు భారత్‌కు 50% చమురు, సహజవాయువు సరఫరాదారులు. 90 లక్షల మంది భారతీయులు అక్కడ పనిచేస్తున్నారు. సౌదీ 100 బిలియన్ డాలర్లు, యూఏఈ 75 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టారు. ఈ దేశాలు కాశ్మీర్‌ను భారత అంతర్గత విషయంగా గుర్తించడం పాకిస్తాన్‌కు తీవ్ర దెబ్బ. ఇస్లామిక్ దేశాలే అయినా.. పాకిస్తాన్‌కు దూరం అవుతూ భారతంతో సత్సంబంధాలు బలోపేతం చేసుకుంటున్నాయి. కతార్‌లో భారత నేవీ అధికారుల విడుదల దీనికి ఉదాహరణ.

**చైనా ఆధిపత్యానికి చెక్..**

భారత్ ఐఎంఈసీ(ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఆర్థిక మార్గం) ద్వారా చైనా బీఆర్ఐ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటోంది. భారత్ నుంచి యూరప్‌కు సరుకుల ప్రయాణం 40% వేగవంతమవుతుంది. రైలు మార్గాలతోపాటు గ్రీన్ హైడ్రోజన్ పైప్‌లైన్లు, డేటా కేబుల్స్ ఏర్పాటు. అప్పుల బాధ్యత లేకుండా అన్ని దేశాలు సమాన భాగస్వాములు. ఇది చైనా పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌కు సవాల్. భారత్ ప్రపంచ వాణిజ్య హబ్‌గా ఎదుగుతుంది.

**పశ్చిమ ఆసియా క్వాడ్ శక్తి**

ఇండియా, ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికా వాణిజ్యం, ఇంధనం, నీటి, రవాణా, అంతరిక్షం, ఆరోగ్యం, ఆహార భద్రతలో ఉమ్మడి ప్రాజెక్టులు. గల్ఫ్ సంబంధాలను చమురు మించి టెక్నాలజీ, భద్రత వైపు మలిచింది. యూఏఈలో 7 ఎమిరేట్లు (అబుదాబి, దుబాయ్, షార్జా మొదలైనవి) సమాఖ్య.

ఈ దౌత్య చర్యలు భారత్‌ను ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయాల్లో కీలకంగా నిలుపుతాయి. చైనా-పాక్ కూటమికి గట్టి సమాధానం. మోదీ ఆత్మీయత ఈ బంధాలను మరింత బలపరుస్తోంది.

# వైవిధ్య మార్గాల అన్వేణ

- విదేశాల్లో ఆయిల్ క్షేత్రాలు..
- సొంత ఉత్పత్తులపై భారత్ దృష్టి

**న్యూఢిల్లీ:**




భారత్ ప్రపంచంలో చమురు వినియోగ దేశాల్లో రెండోస్థానంలో ఉంది. మొదటిస్థానంలో చైనా ఉంది. భారత్ 90 శాతం చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంతో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యా ఆయిల్ దిగుమతులు నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో మిత్రదేశమైన రష్యాకు భారత్ అండగా నిలిచింది. మరోవైపు రష్య కూడా బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకు ఇంధనం సరఫరా చేస్తోంది. అయితే దీనిని అమెరికా జీర్ణించుకోవడం లేదు. ఈ కరణంగానే అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఇంకా విధిస్తామని బెదిరిస్తున్నాడు. మరోవైపు వెనుజువెలా ఆక్రమణ నేపథ్యంలో రష్యాలోని షెల్ ఆయిల్‌ను భారత్‌కు సరఫరా చేయాలని ప్లాన్ వేస్తున్నాడు. ఈ క్రమంలో భారత్ వైవిధ్యమైన మార్గాలు అన్వేషిస్తోంది. ఇంధన భద్రతను బలోపేతం చేస్తోంది. తాజాగా యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ పర్యటన సందర్భంగా మోదీతో కీలక చర్చలు జరిపారు.

**విదేశాల్లో సొంత ఉత్పత్తి..**

వెనెజువెలాలోని 'సాన్ క్రిస్టోబల్' ప్రాజెక్టుల్లో ఓఎన్జీసీకి పెద్ద వాటాలు ఉన్నాయి. 600 మిలియన్ డాలర్ల లాభాలు చమురు రూపంలో అందుతాయి. కానీ అక్కడి ముదురో ప్రభుత్వం కూలిపోవడంతో ఇప్పుడు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు గయానాలో 11 బిలియన్ బ్యారెళ్ల నిల్వల్లో ఓఎన్జీసీ, రిలయన్స్ 2026 వేలంలో పాల్గొని ఉత్పత్తి హక్కులు సాధించబోతున్నాయి.

**రష్యా క్షేత్రాల్లోనూ ఉత్పత్తి..**

రష్యాలో ఓఎన్జీసీకి సాఖాలిన్-1లో 20%, వాంకోర్ క్షేత్రంలో 26% వాటాలు. 2009లో టామ్స్క్ ప్రాంతంలో ఇంపీరియల్ ఎనర్జీని పూర్తిగా స్వాధీనం చేసుకుంది. ఈ ప్రాజెక్టులు భారత ఇంధన అవసరాలకు స్థిరమైన మద్దతు.

**అబుదాబిలో సొంత ఉత్పత్తి..**

అబుదాబిలో బీపీసీఎల్, ఐవోసీ కలిసి ఉర్జా భారత్' సంస్థ ఆన్‌షోర్ బ్లాక్-1లో చమురు కనుగొన్నాయి. తాజాగా ఎక్స్‌ఎన్-76 (షిలైఫ్) బావిలో తేలిక ముడి చమురు, ఎక్స్‌ఎన్-79 (హబ్షాన్)లో కొత్త నిక్షేపాలు లభించాయి. 6,162 చ.కి.మీ. విస్తీర్ణంలో 100% హక్కులతో పూర్తి ఉత్పత్తి అనుమతి. 2019 నుంచి సాగుతున్న అన్వేషణ దశ ముగిసి, భారీ పెట్టుబడులతో తవ్వకాలు మొదలయ్యాయి. యూఏఈ ఇంధన ఉత్పత్తిలో కూడా ఇప్పుడు భారత్‌కు అతిపెద్ద భాగస్వామిగా మారింది.సౌదీ సరఫరాలు, రష్యా-వెనెజువెలా-గయానా ప్రాజెక్టులు, అబుదాబి ఉత్పత్తి - ఇవి భారతాన్ని దిగుమత ఆధారాల నుంచి స్వావలంబన వైపు నడిపిస్తున్నాయి. అమెరికా ఒత్తిడికి భారత్ స్వయం సమృద్ధి మార్గం ఎంపిక చేసుకుంది.

# జాక్ పాట్..

- రూ.500 లకు 10 కోట్లు..
- లారీ డ్రైవర్ పృథ్వి సింగ్ ను వరించిన 'లాటరీ' అదృష్టం

**ముద్ర, హర్యానా :**

లచ్చిందేవి అతని మీద కటాక్షించింది.. ఒక్క రోజులోనే అతని పేదరికాన్ని రూపుమాపింది.. చూస్తుండగానే అతడిని కోటీశ్వరుడిని చేసింది. నిన్నటిదాకా అంతంతమాత్రంగా ఉన్న అతడి జీవితం ఇప్పుడు ఒక్కసారిగా మారిపోయింది. హర్యానా రాష్ట్రంలో లోహ్రి మకర సంక్రాంతి పేరుతో బంపర్ లాటరీ తీశారు. ఈ లాటరీలో హర్యానాకు చెందిన డ్రైవర్ పృథ్వి సింగ్ జాక్ పాట్ కొట్టాడు. రూ.500 తో టికెట్ కొనుగోలు చేసిన అతడు లాటరీలో 10 కోట్ల రూపాయలు సంపాదించాడు. దీంతో అతని ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.. పృధ్వి కి భార్య సుమన్, కుమారుడు దక్షం, కుమార్తె రితిక, తండ్రి దేవిలా ఉన్నారు. పృధ్వి ఒక సాధారణ లారీ డ్రైవర్. దిగువ మధ్య తరగతి జీవితం.. అయితే తెలిసిన వ్యక్తి చెప్పడంతో 500 పెట్టి లాటరీ టికెట్ కొన్నాడు. వాస్తవానికి తనకు లాటరీ తగులుతుందని అసలు అతడు ఊహించలేదు. అయితే రాత్రి పురస్కరించుకొని లాటరీ తీయడంతో పృద్వి కొనుగోలు చేసిన టికెట్ నెంబర్ తగిలింది. ఆ నెంబర్కు 10 కోట్ల లాటరీ తగిలింది. దీంతో పృద్వి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చూస్తుండగానే అతని పేదరికం కాలగర్భంలో కలిసిపోయింది. అతడు ఇప్పుడు కోటీశ్వరుడిగా మారిపోయాడు. లాటరీలో డబ్బు గెలిచిన తర్వాత పృద్వి కుటుంబ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. మనదేశంలో కేరళ, ఈశాన్య రాష్ట్రాలు అధికారికంగా లాటరీ నిర్వహిస్తుంటాయి. ఇందులో హర్యానా కూడా ఉంది. హర్యానాలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన లాటరీలో పృద్వి 10 కోట్లు గెలుచుకున్నాడు. " 500 పెట్టి టికెట్ కొనుగోలు చేశాను. లాటరీ తగులుతుందని ఆశ అయితే నాకు లేదు. కాకపోతే ఒకసారి ప్రయత్నించాలని చూశాను. ఈసారి అదృష్టం



నా వైపు ఉంది. దేవుడు నన్ను కనికరించాడు. అందువల్లే పది కోట్ల లాటరీ తగిలింది. వచ్చిన డబ్బుతో మంచి ఇల్లు నిర్మించుకుంటాను. పిల్లలను అత్యున్నతమైన విద్యాసంస్థల్లో చదివిస్తాను. మిగిలిన డబ్బుతో వ్యాపారం మొదలు పెడతానని" పృథ్వి పేర్కొన్నాడు.



# సలాం 'దోస్తులు'

- విద్యార్థినికి క్యాన్సర్..
- గుండు కొట్టించుకున్న సహచరులు
- వారి బాటలోనే టీచర్

**ముద్ర:**

మారుతున్న జీవన విధానం.. ఆహారపు అలవాట్ల కారణంగా క్యాన్సర్ వేగంగా విస్తరిస్తోంది. వయసుతో సంబంధం లేకుండా వ్యాధిబారిన పడుతున్నారు. ఇక క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌తో జుట్టు ఊడిపోవడం సహజం. తాజాగా ఓ చిన్నారి క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతోంది. దీంతో చిన్నారి జుట్టు ఊడిపోయింది. ఈ విషయం తెలుసుకున్న సహచర విద్యార్థినులు నీకు మేము తోడు ఉన్నామని గొప్ప మనసు చాటుకున్నారు. బాధిత చిన్నారిలో ధైర్యం నింపేందుకు తరగతి గదిలోని చిన్నారులంతా గుండు కొట్టించుకున్నారు. విద్యార్థినుల త్యాగాన్ని చూసి టీచర్ కూడా వారిబాటలో నడిచి ఆదర్శంగా నిలిచారు.

**సోషల్ మీడియాలో వైరల్..**

విద్యార్థులు అందరూ ఒకేసారి గుండు చేయించుని పాఠశాలకు వచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సహచరుల మద్దతు చూసిన క్యాన్సర్ బాధిత చిన్నారికి ఎంతో ధైర్యం వచ్చింది. 'ఇక నేను భయపడను, మా స్నేహితులంతా నాతో ఉన్నారు' అని పేర్కొంది. ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తున్నారు. సహచర చిన్నారులను అభినందిస్తున్నారు. క్యాన్సర్ వంటి వ్యాధుల్లో ఒంటరిగా పోరాడాల్సిన బాధితులకు సమాజ సమర్థన ఎంత ముఖ్యమో ఈ చిన్నారులు చూపించారు.

**నెటిజన్ల స్పందన.**

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోను నెటిజన్లు లైక్, షేర్ చేస్తున్నారు. ఇదే సమయంలో చిన్నారికి ధైర్యం చెబుతున్నారు. సహచర విద్యార్థులను అభినందిస్తున్నారు. 'ఇదే నిజమైన మానవత్వం' అంటూ పోస్టులు పెడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సెలబ్రిటీలు, సంస్థలు కూడా స్వీయ ప్రయత్నాలకు ప్రేరణ పొందారు. ఇలాంటి చిన్న చర్యలు గొప్ప మార్పును తీసుకురావచ్చని నిరూపితమైంది.



# ఇరాన్ మెరుపుదాడి..

- కరాచీ పోర్టులో విధ్వంసం
- దగ్ధమైన నౌక
- ఉలిక్కిపడిన పాకిస్తాన్

**కరాచీ :**

పాకిస్తాన్ సైన్యాన్ని గాజాలో మోహరించేందుకు ఇటీవలే అమెరికా ఆదేశాలను అంగీకరించింది. ఇక ఇరాన్‌పై యుద్ధానికి కూడా అమెరికా ఆదేశాల మేరకు 30 వేల మంది సైనికులను ఇరాక్ సరిహద్దుకు పంపించింది. పాకిస్తాన్ చర్యలను గమనించిన ఇరాన్.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో పాకిస్తాన్‌లోని కీలక నౌకాదళ కేంద్రం కరాచీ పోర్టులో సరుకులను రవాణ చేస్తున్న ఒక నౌక అకస్మాత్తుగా దగ్ధమైంది. పేలుళ్లతో పోర్టు మొత్తం ఉలిక్కిపడింది. పాకిస్తాన్ నేవీ అధికారులు ఈ విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. అయితే ఈ నౌక ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేసే ప్రయత్నానికి సంబంధించినదని సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను తీవ్రతరం చేస్తోంది.

**పోర్టులో నౌకపై దాడి..**

కరాచీ పోర్టు నుంచి బయలుదేరబోయే పడవలో పేలుడు పదార్థాలు లోడ్ చేయబడ్డాయి. ఇరాన్ నుంచి వచ్చిన డ్రోన్ దాడితో పడవ దగ్ధమైంది. పెద్ద శబ్దాలు వినిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పాకిస్తాన్ అధికారులు ఘటనను దాచిపెట్టి, విచారణ పేరుతో మీడియాను అదుపులోకి తీసుకున్నారు.

**ఆయుధాలు ఎవరి కోసం..?**

పడవలో ఇరాన్‌లోని తిరుగుబాటు ఉద్యమకారులకు పంపబోయే ఆయుధాలు ఉన్నాయి. ఇరాన్ ప్రతినిధులు పాకిస్తాన్‌ను ఆరోపిస్తూ, ఇస్లామిక్ దేశాల మధ్య ఈ చర్యను క్షమించలేమని హెచ్చరించారు. దక్షిణ ఇరాన్‌లోని బుషేర్ ప్రాంతంలో 60 వేల ఆయుధాలు పట్టుబడ్డాయి. ఇవి హింసను పెంచేందుకు ఉద్దేశించినవి. బలూచిస్తాన్ ప్రాంతం నుంచి ఈ సరఫరాలు జరుగుతున్నాయని ఇరాన్ అనుమానిస్తోంది.

**ఇరాన్‌లో అంతర్గత ఉద్యమాలు..**

మరోవైపు ఇరాన్‌లో ఖమేనీ నాయకత్వానికి వ్యతిరేక ఉద్యమాలు హింసాత్మక రూపం సంతరించుకుంటున్నాయి. ఇంటర్నెట్ బ్లాక్ చేయబడినా, ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ ద్వారా సమాచారం వెలుగులోకి వస్తోంది. సీస్తాన్ బలూచిస్తాన్ వంటి ప్రాంతాల నుంచి ఆయుధాలు చేరుకుంటున్నాయి. గతంలో అమెరికా ఇరాన్‌పై దాడులకు పాకిస్తాన్ బేసులను ఉపయోగించడంతో ఇరాన్ పాకిస్తాన్‌పై అస్థిర దృష్టి పెట్టింది. పాకిస్తాన్ ఆయుధ సరఫరాల ద్వారా ఇరాన్ అంతర్గత అస్థిరతలను పెంచేందుకు కృషి చేస్తోందని ఆరోపణలు బలపడ్డాయి. ఇది బలూచ్ ప్రాంతంలోని విభజనవాద ఉద్యమాలను రెచ్చగొట్టవచ్చు. అమెరికా ప్రభావం కూడా ఈ సంఘటనల వెనుక ఉండవచ్చని తెలుస్తోంది.



# అమెరికా 'పప్పులు' ఉడకవు..

- దిగుమతి అయ్యే తృణధాన్యాలపై 30 శాతం సుంకం
- ట్రంప్ కీలెరిగి వాతలు పెడుతున్న మోదీ!
- అమెరికా రైతులను వణికిస్తున్న మోదీ వ్యూహం

**న్యూఢిల్లీ :**

డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చి ఏడాదైంది. మొదటిసారి అధ్యక్షుడు అయ్యాక భారత్‌కు మంచి మిత్రుడిగా ఉన్నాడు. మోదీకి అత్యంత సన్నిహితంగా మెదిలాడు. 2.0 పాలన తుగ్లక్ పాలనను తలపిస్తోంది. అమెరికా ప్రయోజనాలకన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే ట్రంప్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రపంచ దేశాలపై రివర్స్ టారిఫ్‌లు విధించారు. ఇప్పటికీ తన మాట వినని దేశాలపై కక్ష్య సాధింపునకు దిగుతున్నాడు. ట్రంప్ భారత ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించి వాణిజ్య ఒత్తిడి తీర్చుకుంటుంటే, మోదీ సైలెంట్‌గా ట్రంప్ కీలెరిగి వాత పెడుతున్నారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే తృణధాన్యాలు, ముఖ్యంగా పప్పు దినుసుల పై 30 శాతం సుంకం వేసి రాయితీలు రద్దు చేసింది. ఈ వ్యూహాత్మక చర్య అమెరికా రైతులను వణికిస్తుంది.

**ట్రంప్ ఒత్తిడి.. భారత్ స్పందన..**

ట్రంప్ గతంలో రష్యన్ చమురు దిగుమతులు, గ్రీన్ ఎనర్జీ విషయాలతో భారత వస్తువులపై 50 శాతం వరకు సుంకాలు పెంచాడు. భారతదేశం దీనికి ప్రకటనలు చేయకుండా, అక్టోబర్‌లో ఈ నిర్ణయం తీసుకుని నవంబర్ నుంచి అమలు ప్రారంభించింది. ప్రచారం లేకుండా జరిగిన ఈ చర్య అమెరికా పప్పు ఎగుమతులను గణనీయంగా ప్రభావితం చేసింది.

**అమెరికాలో ఆందోళనలు**

అమెరికాలోని నార్త్ డకోటా, మోంటానా రాష్ట్రాల్లో పప్పు దినుసుల సాగు ప్రధానం. ఈ సుంకాల వల్ల భారత మార్కెట్‌లో వాటా తగ్గడంతో స్థానిక రైతులు కష్టాలు అనుభవిస్తున్నారు. సెనేటర్లు కెవిన్ క్రామర్, స్టీవ్ డెయిన్స్ ట్రంప్‌కు లేఖ రాసి, భారతీయులు పప్పులు ఎక్కువగా తినే దేశమని, ఈ సుంకాలు తొలగించాలని మొరపెట్టారు. మూడున్నర నెలల తర్వాత ఈ లేఖతో మాత్రమే విషయం వెలుగులోకి వచ్చింది.

**గత సంఘటనలు..**

2019లో కూడా ట్రంప్ సుంకాలకు భారత్ ఇలాంటి సమాధానం ఇచ్చి, అతన్ని మోదీకి లేఖ రాయించింది. ఇప్పుడు అదే భావన పునరావృతం అవుతోంది. ట్రంప్ అరవటలతో ముందుకు వెళ్తుంటే, భారత్ అమలును ఆయుధంగా చేసుకుంది. దేశీయ రైతుల రక్షణకు 'నో కాంప్రమైజ్' విధానం పాటిస్తూ, వాణిజ్య యుద్ధంలో బలమైన స్థానం సంపాదించింది. మోదీ, జైశంకర్, పీయూష్‌గోయల్, దోవల్‌లాంటి నాయకులు కలిసి ఈ వ్యూహాన్ని రూపొందించారు. ఒకరు విదేశీ వ్యూహాలు రూపొందించగా, మరొకరు పరిణామాలను అంచనా వేసి అమలు చేశారు. ఈ చర్య అమెరికా మార్కెట్‌పై ఆధారపడకుండా భారత బలాన్ని చూపించింది. నెటిజన్లు ఈ సైలెంట్ రెస్పాన్స్‌ను సంబరాలతో అభినందిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం
21-01-2026
4 వేదిక
Peoples Voice

# సెట్ చేస్తోన్న రేవంత్.. ఫాలో అవుతోన్న బీఆర్ఎస్



తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ఇప్పుడు ఒక సరికొత్త ముఖచిత్రం కనిపిస్తోంది. ఒకప్పుడు రాజకీయ వ్యూహాలకు, ఎజెండా సెట్ చేయడంలో దిట్టగా పేరుగాంచిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్థానాన్ని, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగంగా భర్తీ చేస్తున్నారు. పాలనలో తనదైన ముద్ర వేయడమే కాకుండా, రాజకీయంగా ప్రత్యర్థులకు ఊపిరి సలపనివ్వకుండా ఎజెండాను తన గుప్పిట్లో ఉంచుకోవడంలో రేవంత్ విజయం సాధిస్తున్నారు.

రాజకీయాల్లో ఎవరు చర్చను నడిపిస్తారో, వారికే ఎప్పుడూ పైచేయి ఉంటుంది. గత పదేళ్లలో కేసీఆర్ ఏ అంశం లేవనెత్తినా రాష్ట్రమంతా దాని గురించే చర్చించుకునేది. కానీ, అధికారం మారిన తర్వాత సీన్ రివర్స్ అయ్యింది. రేవంత్ రెడ్డి ప్రతి అడుగులోనూ దూకుడు ప్రదర్శిస్తూ, ప్రతిపక్షాలను కేవలం తన నిర్ణయాలకు 'రియాక్ట్' అయ్యేలా చేస్తున్నారు. అంటే, రేవంత్ ఒక పిచ్ సిద్ధం చేస్తే, ప్రతిపక్షాలు అక్కడ ఆడాల్సిన పరిస్థితిని ఆయన కల్పిస్తున్నారు.

బీఆర్ఎస్ పార్టీకి పదేళ్ల అధికార అనుభవం ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డి సృష్టిస్తున్న పొలిటికల్ వేగాన్ని అందుకోవడంలో ఆ పార్టీ విఫలమవుతోంది. కృష్ణా జలాల వివాదం వంటి కీలక అంశాలను బీఆర్ఎస్ లేవనెత్తినప్పటికీ, రేవంత్ రెడ్డి వెంటనే మరో కొత్త అంశాన్ని ఉదాహరణకు హైడ్రా లేదా మూసీ ప్రాజెక్ట్ తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారు.ఒకప్పుడు ఎజెండాను డిసైడ్ చేసిన బీఆర్ఎస్, ఇప్పుడు కేవలం రేవంత్ విమర్శలకు సమాధానం చెప్పుకోవడానికే పరిమితం కావాల్సి వస్తోంది.

రాబోయే మున్సిపల్ ఎన్నికల కోసం రేవంత్ రెడ్డి అప్పుడే పావులు కదుపుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు ఆయన ఎంచుకున్న అస్త్రాలు ప్రతిపక్షాలను ఇరకాటంలో పెడుతున్నాయి. చెరువుల ఆక్రమణల తొలగింపు ద్వారా పట్టణ మధ్యతరగతి ప్రజల్లో ఒక బలమైన ముద్ర వేయగలిగారు. ఈ ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్ , ఇతర పట్టణాల భవిష్యత్తుపై కొత్త చర్చను లేవనెత్తారు. ప్రతిపక్షాలు వీటిని విమర్శిస్తున్నా, ప్రజల్లో మాత్రం "ప్రభుత్వం ఏదో ఒకటి చేస్తోంది" అనే భావన కలిగించడంలో రేవంత్ సక్సెస్ అవుతున్నారు.

బీఆర్ఎస్ నేతలు రేవంత్ రెడ్డి వేసే ప్రతి అడుగుకు వివరణ ఇచ్చుకోవడానికే తమ సమయాన్ని వెచ్చిస్తున్నారు. తాము గతంలో చేసిన అభివృద్ధిని చెప్పుకోవడం కంటే, రేవంత్ చేసే విమర్శలను తిప్పికొట్టడానికే వారు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది రేవంత్ రెడ్డి పన్నిన వ్యూహాత్మకమైన ట్రాప్ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీనివల్ల బీఆర్ఎస్ తన పాత దూకుడును కోల్పోయి రక్షణాత్మక ధోరణిలో పడిపోయింది.

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఒక 'వన్ మ్యాన్ షో'లా ఎజెండాను నడిపిస్తున్నారు. ముఖ్యమంత్రిగా పాలన సాగిస్తూనే, రాజకీయ వ్యూహకర్తగా ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడేయడం ఆయన చాణక్యానికి నిదర్శనం. రాబోయే ఎన్నికల్లో ఈ ఎజెండా సెట్టింగ్ ప్రభావం స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ తన వ్యూహాలను మార్చుకుని సొంత ఎజెండాతో ముందుకు రాకపోతే, రాజకీయంగా మరింత వెనుకబడే ప్రమాదం ఉంది.

**- నరేష్ , ముద్ర**

# కాళేశ్వరం కథ.. ఏ కంచికి?



**తెలంగాణ జీవనాడిగా భావించే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తీవ్ర అనిశ్చితిలో చిక్కుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో తలెత్తిన నిర్మాణ లోపాలు ఒకవైపు... వాటి మరమ్మతుల విషయంలో నిర్మాణ సంస్థలు ప్రభుత్వం మధ్య మొదలైన న్యాయపోరాటం మరోవైపు... ఈ మహా ప్రాజెక్టు భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయి. వేల కోట్ల ప్రజాధనం, లక్షలాది రైతుల ఆశలు ఇప్పుడు వివాదాల నడుమ నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది.**

## బ్యారేజీలా కాదా? రిజర్వాయర్లలా వాడారా?

నిర్మాణ సంస్థలు తమ బాధ్యత నుంచి తప్పించుకునేందుకు కొత్త వాదనను ముందుకు తెస్తున్నాయి. సాధారణంగా బ్యారేజీలు నీటిని మళ్లించడానికి మాత్రమే ఉపయోగిస్తారని, కానీ కాళేశ్వరం ప్రాజెక్టులో వాటిని ఏడాది పొడవునా నీటిని నిల్వ చేసే రిజర్వాయర్లలా వాడారని పేర్కొంటున్నాయి. ఇదే నిర్మాణాలపై అధిక ఒత్తిడిని కలిగించి లోపాలకు కారణమైందని సంస్థలు చెబుతున్నాయి.

ప్రధాన నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ తో పాటు మరికొన్ని కంపెనీలు డిజైన్ మార్పులు అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకే జరిగాయని, తమపై తప్పు మోపడం సరి కాదని వాదిస్తున్నాయి. మరమ్మతులు చేయాలంటే పాత ఒప్పందాల ప్రకారం కాదని, కొత్త నిధులు కేటాయించి కొత్త ఒప్పందాలు కుదిరితేనే ముందుకు వస్తామని స్పష్టం చేస్తున్నాయి.

## ప్రభుత్వం కఠిన వైఖరి

ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంది. ముఖ్యంగా మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి పూర్తి బాధ్యత నిర్మాణ సంస్థలదేనని ప్రభుత్వం తేల్చి చెబుతోంది. సొంత ఖర్చులతో రిపేర్లు చేపట్టకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేసింది.

ప్రభుత్వానికి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదికతో పాటు విజిలెన్స్ రిపోర్టులు బలంగా మారాయి. ఈ నివేదికలు నిర్మాణ లోపాలనే ప్రధాన కారణంగా చూపుతున్నాయి. అయితే గత ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టు పూర్తయినట్లు సర్టిఫికెట్లు ఇవ్వడం, 'డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ (DLP)' ముగియడం ఇప్పుడు నిర్మాణ సంస్థలకు ఊరటగా మారింది.

## క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏంటి?

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మూడు బ్యారేజీల పరిస్థితి మూడు రకాలుగా ఉంది. మేడిగడ్డ బ్యారేజీ అత్యంత దారుణంగా దెబ్బతిన్నట్లు నిపుణులు చెబుతున్నారు. రాఫ్ట్ కుంగిపోవడం, పగుళ్లు ఏర్పడడంతో పునాదుల నుంచి పునర్నిర్మాణం లేదా భారీ మరమ్మతులు అవసరమని అంచనా.

అన్నారం బ్యారేజీలో గేట్ల వద్ద వరద విస్తరణ సమస్యలు ఉన్నాయని, రక్షణ చర్యలు చేపడితే కొంతమేర కోలుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. సుందిళ్ల బ్యారేజీలో ప్రధానంగా సీపేజ్ సమస్య ఉంది. లీకేజీలను అరికడితే మళ్లీ వినియోగంలోకి తేవచ్చని నిపుణుల అభిప్రాయం.

## రాజకీయ రంగు పూసుకున్న వివాదం

ఈ వ్యవహారం ఇప్పుడు కేవలం సాంకేతిక సమస్యగా మిగలలేదు. పెద్ద రాజకీయ అస్త్రంగా మారింది. నిర్మాణ సంస్థలు కోర్టును ఆశ్రయిస్తే స్టేలు వచ్చే అవకాశం ఉందని, అలా అయితే మరమ్మతులు ఏళ్ల తరబడి ఆగిపోయే ప్రమాదం ఉందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

కాళేశ్వరంపై నమ్మకం తగ్గుతున్న నేపథ్యంలో తుమ్మిడి హెట్టి వద్ద కొత్త బ్యారేజీ నిర్మాణంపై కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. అయితే వేల కోట్ల ప్రజాధనం వెచ్చించిన ప్రాజెక్టు నిరుపయోగంగా మారితే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు ఒక ఇంజనీరింగ్ సమస్యగా కాకుండా న్యాయ , రాజకీయ సంక్షోభంగా మారింది. నిర్మాణ సంస్థలు బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తుండగా, ప్రభుత్వం వారిని జవాబుదారీ చేయాలనే పట్టుదలతో ఉంది. ఈ వివాదాల మధ్య నష్టపోతున్నది మాత్రం రైతులే. తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తు కోసం ఈ సంక్షోభానికి త్వరిత పరిష్కారం దొరకాలన్నదే ప్రజల ఆకాంక్ష.

# భారత్ లో బంగారు నాణేల రాజ్యం.. ఆ రాజు కథ తెలుసా?



భారత చరిత్రలో 'ఇండియన్ నెపోలియన్'గా గుర్తింపు పొందిన గుప్త చక్రవర్తి సముద్రగుప్తుడు పాలనపై ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా ఆయన రాజ్యంలో దాదాపు పూర్తిగా బంగారు నాణేలే చలామణిలో ఉండటం చరిత్రకారులను ఇప్పటికీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వెండి నాణేలు అరుదుగా కూడా కనిపించకపోవడం వెనుక కారణాలపై పలు పరిశోధనలు జరుగుతున్నాయి.



## సామర్థ్యమే వారసత్వానికి ప్రమాణం

గుప్త వంశ స్థాపకుడు చంద్రగుప్తుడు మొదటివాడు తన పెద్ద కుమారుడిని కాదని, చిన్న కుమారుడైన సముద్రగుప్తుడిని సింహాసన వారసుడిగా ఎంపిక చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. ఈ విషయాన్ని అలహాబాద్ శిలా శాసనం స్పష్టంగా నమోదు చేసింది.
తండ్రి నమ్మకాన్ని నిలబెట్టుకున్న సముద్రగుప్తుడు, తరువాత కాలంలో భారత చరిత్రలోనే అత్యంత శక్తివంతమైన చక్రవర్తుల్లో ఒకరిగా ఎదిగాడు.

## పేరు కాదా? బిరుదా?

సముద్రగుప్తుడు అనేది వ్యక్తి పేరు కాకుండా, ఒక బిరుదు అనే వాదన కూడా చరిత్రకారుల్లో ఉంది. సముద్ర తీరాల వరకు విస్తరించిన సామ్రాజ్యానికి ప్రతీకగా ఈ పేరు వచ్చిందని కొందరు పేర్కొంటున్నారు. అదే సమయంలో, 'కాచ్' అనే పేరుతో లభించిన బంగారు నాణేల కారణంగా వారసత్వ పోరాటం జరిగిందన్న వాదన కూడా వినిపిస్తోంది.

## కవి, సంగీతకారుడు, వీరుడు

సముద్రగుప్తుడు కేవలం యోధుడే కాదు. ఆయనకు 'కవిరాజ' అనే బిరుదు ఉంది. వీణ వాయిస్తున్న రూపంలో ముద్రించిన నాణేలు ఆయన సంగీతాభిరుచికి నిదర్శనం. అలహాబాద్ శాసనాల్లో ఆయన యుద్ధ గాయాలతో కూడిన శరీరాన్ని కూడా గర్వంగా వర్ణించారు.

## ఉత్తరాన విలీనం — దక్షిణాన రాజనీతీ

ఉత్తర భారతంలో తొమ్మిది రాజ్యాలను పూర్తిగా జయించి తన సామ్రాజ్యంలో విలీనం చేసిన సముద్రగుప్తుడు, దక్షిణ భారతంలో మాత్రం భిన్నమైన విధానాన్ని అనుసరించాడు. అక్కడి రాజ్యాలను పన్నులు చెల్లించే విధంగా చేసి, తిరిగి స్థానిక పాలకులకే అప్పగించాడు. ఈ వ్యూహంతో సామ్రాజ్య విస్తీర్ణం పెరిగినా, పాలనపై భారం తగ్గిందని చరిత్రకారులు విశ్లేషిస్తున్నారు.

## బంగారు నాణేలు మాత్రమే ఎందుకు?

సముద్రగుప్తుడి కాలంలో వెండి నాణేలు కనిపించకపోవడానికి ప్రధాన కారణం ఆయన సైనిక విజయాలేనని నిపుణులు చెబుతున్నారు. దండయాత్రల ద్వారా సేకరించిన అపారమైన బంగారాన్ని నాణేలుగా ముద్రించారు.
బంగారు నాణేలు రాజ్య ధనికత్వానికి, రాజకీయ ప్రతిష్ఠకు చిహ్నంగా నిలిచాయి. అంతేకాదు, శ్రీలంక, గాంధార, కాబూల్ వంటి విదేశీ రాజ్యాలతో ఉన్న వాణిజ్య, దౌత్య సంబంధాలకు కూడా ఇవి దోహదపడ్డాయి.



## 'ఇండియన్ నెపోలియన్' బిరుదు

బ్రిటిష్ చరిత్రకారుడు విన్సెంట్ స్మిత్ సముద్రగుప్తుడిని 'నెపోలియన్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించాడు. జీవితకాలంలో ఒక్క యుద్ధంలో కూడా ఓటమి లేకుండా, విస్తృత సామ్రాజ్యాన్ని నిర్మించిన ఘనత ఆయనకే దక్కింది.

## చరిత్రలో చిరస్థాయి స్థానం

సుమారు 45 సంవత్సరాల పాలన అనంతరం క్రీ.శ. 380లో సముద్రగుప్తుడు కన్నుమూశాడు. అయినప్పటికీ, ఆయన బంగారు నాణేలు, శాసనాలు, సైనిక విజయాలు ఇప్పటికీ గుప్త సామ్రాజ్య వైభవాన్ని చాటిచెబుతున్నాయి. చరిత్రకారుల మాటల్లో చెప్పాలంటే సముద్రగుప్తుడి రాజ్యం బంగారంతో మాత్రమే కాదు, అసాధారణ నాయకత్వంతో వెలిగిన సామ్రాజ్యం.

**- ఎడిటోరియల్ డెస్క్**

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



# ఇందిరమ్మ బిల్లులు విడుదల

- **ఒకే రోజు 23 వేల మందికి రూ.262.51 కోట్ల చెల్లింపులు**

**ముద్ర, హైదరాబాద్:**

రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సొంత ఇంటిని నిర్మించుకుంటున్న సుమారు 23 వేల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 262.51 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని ఆధార్ నెంబర్ ఆధారంగా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారం చేసిన చెల్లింపుల్లో, బేస్ మెంట్ స్థాయి నిర్మాణపు పనులను పూర్తి చేసిన లబ్ధిదారులు 2763 ఉండగా, గోడలు శ్లాబ్ కట్టడాల స్థాయి దాటిన వారు 20,186 ఉన్నారని ఆయన వివరించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రతి బిల్లు విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఈ ఏడాది మార్చి వరకు లక్ష ఇండ్లను పూర్తి చేయడంతోపాటు, తదుపరి దశను ప్రారంభించడానికి ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవుతున్నదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులు జోరుగా కొనసాగుతున్నాయని తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఇండ్లు కట్టుకుంటున్న వారందరికీ బిల్లులు సకాలంలో విడుదల అవుతున్నాయన్నారు. పూర్తి పారదర్శకంగా, ఆన్ లైన్లోనూ, క్షేత్ర స్థాయిలోనూ పరిశీలన అనంతరమే బిల్లుల మొత్తం మంజూరవుతుందన్నారు.

**మొత్తం రూ. 4351 కోట్లు విడుదల..**

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంతవరకు మొత్తం రూ. 4351 కోట్లకు పైగా నిధులను లబ్ధిదారులకు విడుదల చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు 2.50 లక్షల ఇండ్ల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. వీటిలో సుమారు 1.25 లక్షల ఇండ్లు గోడలు, శ్లాబ లు అయిపోయి త్వరలోనే పూర్తి కానున్నాయని చెప్పారు. మరో 75 వేల ఇండ్ల పనులు బేస్ మెంట్ స్థాయిని దాటిపోయాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ జిల్లాల్లో కలెక్టర్లు తరచు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నారన్నారు. నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. బిల్లులను విడుదల చేయడంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మేనేజింగ్ డైరక్టర్ గౌతం వివరించారు.



# దుర్గం చెరువు దుర్గంధంపై హైడ్రా నజర్

- **క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్**

**ముద్ర, హైదరాబాద్:**

మాదాపూర్ గుట్టల్లో ఉన్న దుర్గం చెరువు దుర్గంధంపై హైడ్రా దృష్టి పెట్టింది. చెరువులోకి నేరుగా మురుగు నీరు చేరడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. దుర్గం చెరువులో గుర్రపు డెక్క వ్యాప్తి చెందడం, దుర్గంధంగా మారడంపట్ల మీడియా కథనాలు, స్థానికుల నుంచి హైడ్రాకు వచ్చిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం దుర్గం చెరువును పరిశీలించారు. చెరువులో సగభాగం వరకూ గుర్రపు డెక్క వ్యాపించడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఎస్టీపీలు ఉన్నప్పటికీ వరద కాలువ ద్వారా మురుగు నీరు నేరుగా దుర్గం చెరువులోకి కలవడం పట్ల కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్టీపీలకు వెళ్లే మురుగు నీరు అధికంగా ఉండడంతో ఇటువైపు మళ్లించాల్సి వచ్చిందని ఇరిగేషన్ ఇంజినీర్లు చెప్పగా అది సరికాదన్నారు. ఎస్టీపీల సామర్థ్యానికి మించిన మురుగు నీరు వస్తే మురుగు కాలువకు మళ్లించాలి కాని.. నేరుగా చెరువులోకి ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ఒకవైపు ఎస్టీపీ ద్వారా మురుగు నీటిని సుద్ధి చేసి చెరువులోకి పంపడం, మరో వైపు నేరుగా మురుగు నీరు వదిలేయడం ఏంటని మండిపడ్డారు.

**సమన్వయంతో పని చేయాలి..**

చెరువును అభివృద్ధి చేయడం అంటే పైపై మెరుగులు దిద్దడం కాదని దుర్గం చెరువు పనులు చేపట్టిన రహేజా సంస్థ ప్రతినిధులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రశ్నించారు. చెరువులోకి మురుగు నీరు కలవడం, గుర్రపు డెక్క వ్యాప్తి చెందడాన్ని నియంత్రించడానికి ఏం చేశారని అడిగారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖ, రహేజా మైండ్‌స్పేస్, ఎస్టీపీల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రాంకీ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం, బాధ్యత పడకపోవడమే దుర్గం చెరువు దుర్గంధానికి కారణమని హైడ్రా కమిషనర్ తెలిపారు. చుట్టుపక్కల మురుగు నీరంతా ఎస్టీపీ లైన్లోకి వెళ్లేలా జాగ్రత్త పడాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్టీపీల వద్ద మురుగు నీరు శుభ్రం అయిన తర్వాత నీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం పీసీబీకి పంపాలని హైడ్రా కమిషనర్ అధికారులను ఆదేశించారు.

**సంబంధిత శాఖల అధికారులతో సమావేశం..**

దుర్గం చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం హైడ్రా కార్యాలయంలో చెరువు పరిరక్షణ బాధ్యతలు చేపట్టిన అన్నిసంస్థలతో హైడ్రా కమిషనర్ సమావేశమయ్యారు. వరద కాలువలోకి మురుగు నీరు వెళ్లకుండా పైపులైను డైవర్షన్ పనులు చేపట్టడానికి జలమండలికి ఉండే ఇబ్బందులను తొలగించారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. ఎం రమేష్‌తో మాట్లాడి ట్రాఫిక్ డైవర్షన్‌కు సహకరించాలని సూచించారు. అలాగే ఇరిగేషన్, విద్యుత్, జీహెచ్ ఎంసీ, జలమండలి విభాగాధికారులతో కూడా మాట్లాడి మురుగునీరు దుర్గం చెరువులోకి చేరకుండా చేపట్టే పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. ఇదే సమయంలో చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన రహేజా సంస్థ ప్రతినిధులతో కూడా మాట్లాడి ఇన్ఆర్బిట్ మాల్, నెక్టర్ గార్డెన్స్ ఇలా పై భాగంలోని ఐటీ సంస్థల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి కలవకుండా చెరువుకు ఆనుకుని పడమర వైపు కాలువను తవ్వేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# మేడారం జాతరకు 4,000 ఆర్టీసీ బస్సులు

- **మేడారం జాతరలో అదనపు బస్సులు అందుబాటులో ఉంచుకోవాలి**
- **ఆర్టీసీ అధికారులు జాతర పూర్తయ్యే వరకు మేడారంలోనే ఉండాలి**
- **రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముద్ర, హైదరాబాద్:**




మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ సమర్థవంతంగా బస్సులు నడపాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో మేడారం జాతరలో 3,491 ఆర్టీసీ బస్సులు నడిపించగా 16.82 లక్షల మంది ప్రయాణించారని తెలిపారు. ఈసారి 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తారనే అంచనాతో 4 వేల బస్సులను నడిపిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే ప్రధానంగా మేడారం వెళ్ళే రూట్లలో వరంగల్ ,హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్ రూట్లలో రద్దీ ఎక్కువగా ఉండనుండడంతో రద్దీగా తగిన విధంగా బస్సులు నడపడానికి అక్కడ అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మేడారం లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ స్టాప్లో క్యూలైన్ ల వద్ద ప్రయాణికులు జిల్లాల వారిగా వెళ్లే బస్సులు డిస్ ప్లే అయ్యేలా చూడాలని, అక్కడ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా పని చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. మేడారంలో సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టినట్టు శాశ్వత ఆర్టీసీ సముదాయ భవనాన్ని నిర్మించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి జరుగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మేడారం వచ్చే భక్తులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగించేలా హోర్డింగులు, బస్ స్టేషన్లలో , బస్సులో టీవీ ల ద్వారా ప్రచారాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ లో పెండింగ్ పనులు, బస్ స్టేషన్ ల అభివృద్ధి పనుల పురోగతి పై ఆరా తీశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో రాబోయే కాలంలో పూర్తిస్థాయిలో ఈవి బస్సులు రానుండడంతో అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు, ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పుడున్న జెబిఎస్, ఎంజీబీఎస్ మాదిరి నగరంలో మరిన్ని బస్ టెర్మినల్ రావాల్సిన అవసరముందన్నారు. దానిని స్టడీ చేయాలని, ఆర్టీసీకి సంబంధించిన భూ బదలాయింపు పై జిల్లా కలెక్టర్ల తో మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న కాలనీలకు ఆర్టీసీ ప్రజా రవాణాలో బాగంగా కొత్త రూట్లలో ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ బస్సు మంచి సత్ఫలితాలు ఇస్తుండటంతో తెలంగాణ వ్యాప్తంగా అవసరమైన రూట్లలో బస్సులు నడిపించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విజన్ 2047 లో ఆర్టీసీ లక్ష్యానికి అనుగుణంగా ఇప్పుడున్న బస్సుల సంఖ్యను మరింత పెంచడం , ఉద్యోగుల సంఖ్యను పెంచడం తదితర వాటిపై కార్యాచరణ తో ముందుకు పోవాలని ఆదేశించారు. సెర్ఫ్ ద్వారా తీసుకోవాల్సిన మిగిలిన బస్సులను త్వరగా ఆర్టీసీలోకి తీసుకోవాలన్నారు. కింది స్థాయిలో క్షేత్ర స్థాయిలో విజిట్ చేసిన అంశాలు ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. పెద్దపల్లి, ఏటూరు నాగారం బస్ డిపోల నిర్మాణాలు వేగంగా జరగాలని ఆదేశించారు. మహా లక్ష్మి ద్వారా 90 కి పైగా డిపోలు లాభాల బాటలో ఉన్నప్పటికీ మిగిలిన డిపో లు నష్టానికి గల కారణాలపై అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఈడిలు , ఆర్ఎంలు, ఇతర ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.




# జీహెచ్ఎంసీలో జీతాల కోసం ఇంజనీర్ల తిప్పలు

**ముద్ర, హైదరాబాద్:**

బల్దియాలో పొరుగు సేవల ఇంజినీర్లు జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. రెండు నెలలుగా వేతనాలు అందక అప్పుల తిప్పలు పడలేక వారు ఆవేదనతో మూకుమ్మడిగా జీహెచ్ఎంసీకి వందలామంది ఇంజినీర్లు తరలివచ్చారు. రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ప్రధాన కార్యాలయం సాక్షిగా కన్నీటి పర్యంతమయ్యారు.

జీహెచ్ఎంసీలో ఐదేళ్లుగా న్యాక్ ద్వారా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన దాదాపు 250 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నారు. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, హౌసింగ్ ఇతర విభాగాల్లో వీరికి ఆయా పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. అయితే ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వీరి ఒప్పంద గడువును ప్రతి ఏటా పెంచుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరి ఒప్పంద గడువు అక్టోబరు నెలాఖరుకు ముగిసింది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోడ్ పేరుతో వీరి ఒప్పంద గడువును మళ్లీ పొడగించకుండా రెండు నెలల పాటు పని చేపిస్తూ వచ్చిన అధికారులు ..వీరికి నెలవారీ వేతనాల విషయంలో కనికరం చూపలేదు. సాంకేతిక కారణాలతో ఫైనాన్స్ విభాగం నుంచి వీరికి జీతాలు ఇచ్చేందుకు వీలు పడలేదు. అయితే ఇక్కడే శాఖల మధ్య సమన్వయ లోపం ఉంది. అడ్మిన్ విభాగం ముందస్తుగా వీరి సేవలు అవసరం అనుకుంటే ఎప్పటిలాగే గడువును పెంచుకుని జీతాలు ఇచ్చేలా చొరవ చూపాలి. కానీ ఇక్కడ అలా జరగలేదు. ఒప్పంద అంశాన్ని దాచి పెట్టి సదరు ఇంజినీర్లతో పనులు జరుపుకొంటూ వచ్చింది.

ఉప ఎన్నికల కోడ్ ముగిసినా వీరికి జీతాలు రాకపోవడం, రోజుల తరబడి అదిగో ఇదిగో అంటున్నారే తప్ప.. జీతాలు ఇవ్వడం లేదంటూ ఏకంగా ప్రధాన కార్యాలయంలో తమ బాధను చెప్పుకొనేందుకు మూకుమ్మడిగా ఇంజినీర్లంతా వచ్చారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఈఎన్‌సీ భాస్కర్‌రెడ్డిని కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని చెప్పడంలో సదరు ఇంజనీర్లు వెనుతిరిగారు. ఒకప్పుడు కామధేనువులా నిధులు కురిపించిన జీహెచ్ఎంసీ నేడు కనీసం ఉద్యోగుల జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి చేరడం పట్ల తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. కాంట్రాక్టర్ల బిల్లులు రూ.వేల కోట్లలో పెండింగ్‌లో ఉంటే, ఇప్పుడు కనీసం పనిచేసిన ఇంజనీర్ల వేతనాలకూ నిధులు లేకపోవడం బల్దియా దివాళా తీసిందనడానికి నిదర్శనమని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

### ప్రభుత్వ అవినీతిని మంత్రులే
# బయటపెట్టుకున్నారు

- **బొగ్గు కుంభకోణంపై కాంగ్రెస్ నిజాయితీని నిరూపించుకోవాలి**
- **సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి**
- **మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

వాటాల్లో తేడాలు, విభేదాలతో రాష్ట్ర మంత్రులు ఒకరిపై మరొకరు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ కాంగ్రెస్ పాలనలో జరిగిన అవినీతిని బయటపెట్టుకున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆమె హైదరాబాద్ లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తుశుద్ధి ఉంటే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించి... బొగ్గు టెండర్ల విషయంలో అవినీతి జరిగిందో లేదో నిగ్గు తేల్చాలన్నారు. ఒకవేళ జరిగితే ఏ విధంగా జరిగిందో బయటపెట్టాలన్నారు. ప్రధాన ప్రతిపక్షం హోదాలో ఉన్న బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులకు గురి చేయాలనే ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక.. రాష్ట్రంలో బలపడుతున్న ప్రతిపక్షాన్ని దెబ్బకొట్టేందుకు కేసులు నమోదు చేస్తూ నోటీసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే హరీష్ రావుకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా నోటీసులు ఇచ్చి విచారణ పేరుతో వేధిస్తున్నారని అన్నారు. మొన్న సర్పంచ్ ఎన్నికల్లో తాకిన దెబ్బతోనే ఏదో డ్రామా ఆడాలని అనుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి నోటీసులు ఎన్ని ఇచ్చినా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు, చేసిన వాగ్దానాలు గాలికి వదిలేసి పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. బతుకమ్మ చీరలు మొన్న గ్రామాల్లో పంచితే ఇప్పుడు ఎన్నికలు ఉన్నాయని నగరంలో పంచుతున్నారని ఆరోపించారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**ముద్ర, కడ్తాల్:**

బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు లేబర్‌కోడ్లు, 2025జాతీయ విత్తన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు కేంద్రం వెన్నుదన్నుగా ఉంటూ ఇప్పటి వరకు రూ.15 లక్షల కోట్ల రాయితీని ఇచ్చిందని విమర్శించారు. అదే విధంగా రాష్ట్రంలో అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్న కార్మికుల సమస్యలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణలోని కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఫిబ్రవరి 12న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ తహసీల్దార్ జయశ్రీకి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రమేశ్, జనార్ధన్, రమేశ్, కృష్ణ, నర్సయ్య, జంగయ్య, యాదయ్య, అంజయ్య, కృష్ణయ్య, మల్లేశ్, రఘుపతి, లక్ష్మయ్య, లక్పతి తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణకు 6 కొత్త అర్బన్ ఫారెస్ట్‌లు

- **నగర్ వన్ యోజన కింద రూ. 8.26 కోట్ల నిధుల మంజూరు**
- **తొలి విడతలో 70 శాతం నిధుల విడుదల**

**ముద్ర, హైదరాబాద్:**

పట్టణాల్లో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నగర్ వన్ యోజన పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి కీలక ప్రోత్సాహం లభించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణలో 6 కొత్త అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటుకు గాను మొదటి విడతలో 70 శాతం నిధులు మొత్తం రూ. 8.26 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు అటవీ దళాల ముఖ్య సంరక్షిణాధికారిణి డా.సి సువర్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ నిధులు తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ పరిధిలోని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా వినియోగించనున్నారు. నగరాలు, పట్టణాల పరిధిలో అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు.

**ఆమోదం పొందిన అర్బన్ ఫారెస్ట్‌ల ప్రాంతాలు:**

ఆదిలాబాద్ జిల్లా: మావళా, యాపల్‌గూడ-II
మంచిర్యాల జిల్లా: ఇందారం (క్యాతనపల్లి మండలం), చెన్నూర్
మెద్చల్-మల్కాజ్‌గిరి జిల్లా: యెల్లంపేట, చెంగిచెర్ల

ఈ అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు వల్ల పట్టణాల్లో హరితావరణం విస్తరించడంతో పాటు గాలి నాణ్యత మెరుగుపడనుంది. అలాగే ఉష్ణోగ్రతల పెరుగుదలను నియంత్రించడం, వర్షపు నీటి సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఉంటుంది.
నగర్ వన్ యోజన ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని పర్యావరణ పరిరక్షణలో ముందంజలో నిలిపే దిశగా ఈ అర్బన్‌ఫారెస్ట్‌లు కీలక పాత్ర పోషిస్తాయి.

నగర్ వన్ యోజన కింద ఏర్పాటయ్యే అర్బన్ ఫారెస్ట్‌లలో స్థానిక వృక్షజాలానికి ప్రాధాన్యం ఇస్తూ విస్తృతంగా మొక్కలు నాటనున్నారు. నడక మార్గాలు, విశ్రాంతి కేంద్రాలు, పచ్చని మైదానాలతో ప్రజలకు ప్రకృతి ఒడిలో విహరించే అవకాశం కల్పించనున్నారు. పిల్లలు, వృద్ధులు, ఉదయ, సాయంత్రపు వాకర్లకు ఈ అర్బన్ ఫారెస్ట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

# జగిత్యాల వైద్య రంగానికి కొత్త ఊపిరి

- జగిత్యాల వైద్య హబ్‌గా రూపాంతరం
- రూ.235 కోట్లతో 450 పడకల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన
- 20 మండలాలు, 5 మున్సిపాలిటీలకు ప్రయోజనం
- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భారీ నిధులు
- పేదలకు నాణ్యమైన వైద్యం లక్ష్యం
- క్రిటికల్ కేర్ భవనం ప్రారంభించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ముద్ర, జగిత్యాల :**

జగిత్యాల జిల్లా వైద్య రంగంలో చారిత్రక ముందడుగు పడింది. జిల్లా కేంద్రంలో రూ.235 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 450 పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి మంగళవారం శంకుస్థాపన జరిగింది. అలాగే రూ.23.5 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్, రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ల ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

**జగిత్యాల వైద్య హబ్‌గా రూపాంతరం**

మెడికల్ కళాశాల, మాతా-శిశు ఆరోగ్య కేంద్రం, క్రిటికల్ కేర్ యూనిట్, సెంట్రల్ మెడిసిన్ స్టోర్లు, 450 పడకల ఆసుపత్రి ఏర్పాటుతో జగిత్యాల జిల్లా పూర్తిస్థాయి వైద్య హబ్‌గా మారనుంది. జిల్లా ప్రజలతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు కూడా నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి రానుంది.

**అత్యవసర సేవలకు బలం: క్రిటికల్ కేర్ యూనిట్**

క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభంతో రోడ్డు ప్రమాదాలు, హఠాత్ అనారోగ్యాలు, అత్యవసర ప్రసూతి శస్త్రచికిత్సలకు తక్షణ వైద్యం లభించనుంది. డయాలసిస్ సేవలు, మూడు ఆపరేషన్ థియేటర్లు, ఆక్సిజన్ వెంటిలేటర్లు వంటి కీలక వసతులు అందుబాటులోకి వస్తాయి.

**20 మండలాలు, 5 మున్సిపాలిటీలకు ప్రయోజనం**

నూతన ఆసుపత్రి, క్రిటికల్ కేర్ వసతులు జిల్లాలోని 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీల ప్రజలకు ఎంతో ఉపయోగపడనున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అన్ని రకాల పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉంటారని మంత్రి తెలిపారు.

**రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భారీ నిధులు**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య-ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో జిల్లా కేంద్రానికి విద్య, వైద్య రంగాల్లో అత్యధిక నిధులు మంజూరయ్యాయని మంత్రి పేర్కొన్నారు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో జగిత్యాల జిల్లాకు ప్రత్యేక మెడికల్ బిల్లు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

**పేదలకు నాణ్యమైన వైద్యం లక్ష్యం**

జిల్లాలోని పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైద్యులు ప్రజల ప్రాణాలను కాపాడే గొప్ప బాధ్యతతో సేవలందించాలని కోరారు. జిల్లా అభివృద్ధికి వందల కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి జగిత్యాల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



బాసర శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయం

## వసంత పంచమి వేడుకలకు బాసరలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**ముద్ర, ముథోల్ :**

బాసరలో బుధవారం నుంచి రెండు రోజులపాటు జరగనున్న వసంత పంచమి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. వసంత పంచమి ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం ఆమె బాసరలోని శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఈవో అంజనీదేవితో కలిసి క్యూలైన్లు, అక్షరాభ్యాస మండపాలను పరిశీలించారు. అనంతరం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఎస్పీ రాజేష్ మీనా, బాసర సీఐ కిరణ్, ఎస్సై నవనీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'అరైవ్–అలైవ్' అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

## రహదారి నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట

**ముద్ర, ఎదులాపురం :**

రహదారి నిబంధనలు తెలుసుకోవడం మాత్రమే సరిపోదు, వాటిని కచ్చితంగా పాటించినప్పుడే ప్రమాదాలను అరికట్టవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'అరైవ్-అలైవ్' అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రహదారి ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు డ్రైవింగ్‌కు అనుమతి ఇవ్వకూడదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, అదనపు ఎస్పీ మౌనిక, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, ఐఎంఏ అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలువలో పడిన క్వాలిస్ వాహనం

## కొండగట్టు మార్గంలో క్వాలిస్ బోల్తా

**11 మందికి తీవ్ర గాయాలు**

**ముద్ర, జగిత్యాల :**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి-కొండగట్టు మధ్య మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. క్వాలిస్ వాహనం అదుపుతప్పి కాలువలో బోల్తా పడటంతో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం, కొండగట్టు అంజన్న దర్శనానికి 11 మంది క్వాలిస్ వాహనంలో వెళ్తుండగా నాచుపల్లి-కొండగట్టు మధ్య వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్నవారికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను రక్షించి, కొందరిని కరీంనగర్, మరికొందరిని జగిత్యాల ఆస్పత్రులకు తరలించారు.



## భక్తులతో కిక్కిరిసిన బద్ది పోచమ్మ ఆలయ పరిసరాలు

**ముద్ర, వేములవాడ :**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భారీగా భక్తులు తరలివచ్చారు. రాజన్న, భీమన్న దర్శనం అనంతరం భక్తులు బద్ది పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి, పోలీసు అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకున్నారు.

## మేడారం జాతర వేళ కొండగట్టులో పెరిగిన భక్తుల తాకిడి

**ముద్ర, మల్యాల :**

జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా ఘాట్ రోడ్డుపై వాహనాల రాకపోకలు కొంతసేపు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. ఆలయంలో భక్తులకు సౌకర్యంగా ఉండేలా చేపట్టిన ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీకాంతరావు పరిశీలించారు.





## భైంసాలో ఘోర రోడ్డు ప్రమాదం

**నలుగురు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు**

**ముద్ర, భైంసా :**

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని సత్‌పూల్ బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కంటైనర్ మరియు కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతులను కుబీర్ మండలం కుప్టీ గ్రామానికి చెందిన భోజరాం పటేల్ (42), రాజన్న(60), బాబన్న(70) మరియు కారు డ్రైవర్ వికాస్(35)గా గుర్తించారు. క్షతగాత్రుల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గంగాధర్ కూడా ఉన్నారు. ఆయన తలకు తీవ్ర గాయాలు కావడంతో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, మృతదేహాలను భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## మున్సిపల్ ఎన్నికల హడావుడి...పట్టణాల్లో రాజకీయ వేడి

- షెడ్యూల్‌పై ఊహాగానాలు, రిజర్వేషన్లతో మారిన సమీకరణలు... ఆశావహుల్లో టికెట్ల టెన్షన్



**ముద్ర, కరీంనగర్ :**

మున్సిపల్ ఎన్నికలపై రోజుకో రకంగా ప్రచారం సాగుతోంది. రెండు మూడు రోజుల్లో షెడ్యూల్ విడుదల అవుతుందనే వార్తలు ఒకవైపు, ఫిబ్రవరిలో పోలింగ్ ఉంటుందనే ఊహాగానాలు మరోవైపు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మున్సిపాలిటీల్లో డివిజన్, వార్డు రిజర్వేషన్లు ఖరారవడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దీంతో కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు పట్టణాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. చెఎన్నికల్లో బరిలో దిగాలనుకునే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. టికెట్ల కోసం పార్టీ నేతల చుట్టూ తిరుగుతూనే, మరోవైపు ఓటర్లను కలుసుకుంటూ మద్దతు కూడగట్టే పనిలో బిజీగా ఉన్నారు.

**రిజర్వేషన్లతో మారిన సమీకరణలు..**

డివిజన్‌ల రిజర్వేషన్లతో పలువురు ఆశావహులు, సీనియర్ నాయకుల ప్రణాళికలు తారుమారయ్యాయి. నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లలో ఒకటి ఎస్టీకి, ఏడు ఎస్సీలకు, 25 బీసీలకు, మిగిలిన 33 అన్‌రిజర్వ్‌గా కేటాయించారు. వీటిలో 33 డివిజన్లు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. రిజర్వేషన్లు అనుకూలించని నేతలు ఇతర డివిజన్ల నుంచి పోటీకి సిద్ధమవుతున్నారు. దీంతో ఏ డివిజన్‌లో ఎవరు బరిలో దిగుతారో తెలియని పరిస్థితి నెలకొంది.

**ఆశావహుల్లో ఆందోళన..**

చాలా కాలంగా మున్సిపల్ ఎన్నికల కోసం ఎదురుచూస్తూ డివిజన్లలో ప్రచారం చేస్తున్న నాయకులు, కొత్త నేతల రాకతో బెంబేలెత్తుతున్నారు. మరో రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందనే ప్రచారంతో ఆశావహులు తెల్లవారు జాము నుంచి రాత్రివరకు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, కరపత్రాలు పంపిణీ చేస్తూ ఆశీర్వాదాలు కోరుతున్నారు. టికెట్ దక్కుతుందో లేదో తెలియక కొందరు పార్టీ మారేందుకు సిద్ధమవుతుండగా, మరికొందరు స్వతంత్రంగా బరిలో దిగాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు. రిజర్వేషన్లు తమ రాజకీయ భవిష్యత్తును మార్చేశాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హుజూరాబాద్‌లో చైర్మన్ రేసు..**

హుజూరాబాద్ మున్సిపాలిటీలో ఈసారి చైర్మన్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడం చర్చనీయాంశంగా మారింది. దళిత సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో బీసీ, జనరల్, జనరల్ మహిళ రిజర్వేషన్లలో చైర్మన్లు ఎన్నిక కాగా, ఈసారి అనూహ్యంగా ఎస్సీ మహిళకు అవకాశం రావడంతో పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు సాగుతోంది. వారం రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముంది.

**జమ్మికుంటలో గరంగర రాజకీయం...**

జమ్మికుంట మున్సిపాలిటీలో చైర్మన్, వార్డు రిజర్వేషన్లు ఖరారవడంతో ప్రధాన పార్టీల వ్యూహాలు మొదలయ్యాయి. చైర్మన్ పీఠం ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో ఆశావహులు లెక్కలు వేసుకుంటున్నారు. ఎన్నికల ఖర్చు కోసం నిధుల సమీకరణ మొదలైంది. అప్పులు, ఆస్తుల తాకట్టు వరకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. టికెట్ల కోసం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల చుట్టూ ప్రదక్షిణలు పెరిగాయి.




## కాంగ్రెస్ కార్పొరేటర్ టికెట్ల కోసం దరఖాస్తుల వెల్లువ

- మొదటి రోజే 255 దరఖాస్తులు
- సర్వే ఆధారంగా అభ్యర్థుల ఎంపిక : కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్

**ముద్ర, డీసీసీ కార్యాలయం, కరీంనగర్ :**

కరీంనగర్ నగర కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఆశిస్తున్న ఆశావహుల నుంచి డీసీసీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ పంచాయతీరాజ్ సంఘటన చైర్మన్ మడుపు మోహన్‌తో పాటు పలువురు నేతలు కలిసి దరఖాస్తులను స్వీకరించారు. మొదటి రోజే నగరంలోని పలు డివిజన్ల నుంచి మొత్తం 255 దరఖాస్తులు అందాయి. పార్టీ శ్రేణుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది జాబితాను పీసీసీకి పంపిస్తామని వైద్యుల అంజన్‌కుమార్ తెలిపారు. సర్వే ఆధారంగా గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి, పార్టీ సింబల్‌తో పోటీ చేసే అవకాశం కల్పిస్తామన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 1 గంటల వరకు గడువు ఉందని తెలిపారు. ఆశావహులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు తప్పకుండా న్యాయం చేస్తామని, ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



# మహిళలకు ఆర్థిక భరోసా..





- స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు
- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఆలేరు మండల కేంద్రంలో వై.యస్.యన్ గార్డెన్స్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు తో కలిసి వడ్డీ లేని ఋణాల చెక్కును పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అందులో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ధృఢ సంకల్పంతో గత రెండు సంవత్సరాల నుండి మెప్మా ద్వారా స్త్రీ శక్తి, స్త్రీల ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా 375 మహిళా సంఘాలకు రూ.78,87,160లు వడ్డీ లేని రుణాల చెక్కును స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ బ్యాంకులు,స్త్రీ నిధి వారి సహకారంతో 179 సంఘాలకు రూ.15,29,00,000/లు బ్యాంకు లింకేజీ చెక్కును అందజేశారు. ఆలేరు మున్సిపాలిటీలో 176 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. పట్టణంలోని 1065 వీధి వ్యాపారులను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## యాదగిరిలో వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు

**ముద్ర, యాదగిరి గుట్ట :**

యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మంత్రికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వేద ఆశీర్వచనాలను ఇచ్చారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు తదితరులు ఉన్నారు.



## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**ముద్ర, వర్ధన్నపేట :**

వర్ధన్నపేటలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షనాయకులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం వర్ధన్నపేటలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. దీంతోపాటు రూ. 15 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు టెస్కాబ్ మాజీ చైర్మన్ రవీందర్ రావుతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. వర్ధన్నపేటలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ఆర్డీఓ కార్యాలయం, సబ్ జైల్, కోర్టు భవనాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొంతమంది ప్రతిపక్షనేతలు తనపై కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, దీని ద్వారా రానున్న మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందలని చూస్తున్నారని అన్నారు. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా నియోజకవర్గ ప్రజలు తాను చేసిన అభివృద్ధిని గమనిస్తున్నారని తెలిపారు.



## సర్పంచుల ఫోరం క్యాలెండర్ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి మండల సర్పంచ్ ల ఫోరమ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను భువనగిరి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. భువనగిరి మండల సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జక్క రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హోటల్ వివేరాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షులు కొలుపుల అమరేందర్, పార్టీ భువనగిరి మండల అధ్యక్షులు, తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ ఏనబోయిన ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, మాజీ ఎంపీపీ, అతికం లక్ష్మి నారాయణ, సర్పంచ్ ల ఫోరం ప్రధాన కార్యదర్శి ర్యాకల సంతోష శ్రీనివాస్, మాజీ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కంచి మల్లయ్య భువనగిరి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్ లు, నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు

- రూ.43.81 లక్షల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కుంభం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో భువనగిరి నియోజకవర్గంలో స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘాలకు రూ. 43 కోట్ల 81 లక్షలు అందజేశామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు సుమారు మూడు కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి ఉచిత బస్సు, ఉచిత కరెంట్ అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ ఆవేస్ చిస్తీ, ఆర్డీవో కృష్ణ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగిర్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## సుప్రీం కోర్టు తీర్పు వర్తించదు..

- తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి
- టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి ఆధ్వర్యంలో వినతి

**ముద్ర, ఖమ్మం:**

ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వం ప్రత్యేక జీవో, క్యాబినెట్ ఆమోదంతో కేటాయించిన 23.02 ఎకరాల భూమికి సుప్రీంకోర్టు తీర్పు వర్తించదని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమర్పించిన వినతిపత్రానికి స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగరంలోని స్థానిక ఎస్.ఆర్. గార్డెన్‌లో జర్నలిస్టుల బృందాన్ని కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య స్థానిక మంత్రుల స్థాయిలోనే పరిష్కారమయ్యే అంశమని, ఇందుకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు విలాసం కాదని, జీవన భద్రతకు సంబంధించిన మౌలిక అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు టి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ, 23.02 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు వర్తిస్తుందన్న అయోమయం మీడియా అకాడమీ చైర్మన్ వ్యాఖ్యలతో పూర్తిగా తొలగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాలయాపన లేకుండా భూమిని జర్నలిస్టులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, (టీబీజేఏ) జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, వీడియో జర్నలిస్ట్ అధ్యక్షులు ఉపేందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి కుంభం రవి కుమార్, పట్టణ అధ్యక్షులు గెంటెల కుమార్, కార్యదర్శి నాయిని స్వాతి, ఎలెక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షుడు ఎలుగోటి వెంకట్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, కార్యదర్శి మల్లెల శిల్ప, సభ్యులు చిన్నంశెట్టి రాంబాబు, కరాటే వేణు, కొండలరావు, జగదీష్, మధు, కందరబోయిన నాగకృష్ణ, శ్రీధర్, సొందుమియా, కిరణ్, పొదిలపు సంతోష్ కుమార్, రాకేష్, వేములకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదాల నియంత్రణకు పూర్తి స్థాయి చర్యలు

- ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సురక్షిత డ్రైవింగ్ తో రహదారి ప్రమాదాలను నివారించవచ్చు
- ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి
- కలెక్టరేట్ లో రోడ్డు భద్రత కమిటీ చర్యల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ముద్ర, ఖమ్మం :**

జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే 30 జంక్షన్ ల వద్ద ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ నందు జంక్షన్ లు, ప్రధాన రహదారులపై జరిగే ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత కమిటీ చేపట్టిన చర్యల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 30 జంక్షన్ లలో 50 శాతం పైగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని, జంక్షన్ల వద్ద రోడ్డు భద్రతా ప్రమాణాలు చేపడితే ప్రమాదాలు నియంత్రించవచ్చని అన్నారు. 30 జంక్షన్ల వద్ద వాహనాల వేగం తగ్గించేందుకు రంబుల్ స్ట్రిప్స్, లేన్ మార్కింగ్, రాత్రి వేళల్లో సరిగ్గా కనిపించేందుకు ఏర్పాట్లు, ఆక్రమణల తొలగింపు, జీబ్రా క్రాసింగ్, సైన్ బోర్డ్స్, బ్లింకర్స్ ఏర్పాటు వంటి చర్యలు త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో 30 జంక్షన్ల వద్ద రోడ్డు భద్రతా చర్యలు చేపట్టడం ప్రాధాన్యతగా తీసుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో ఒక వ్యక్తి చనిపోతే ఒక కుటుంబం తీవ్రంగా ప్రభావితం అవుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క అధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టి జంక్షన్ ల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, నేషనల్ హైవే ఇఇ యుగంధర్, పిడి దివ్య, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ‘ఆపరేషన్ ప్రహార్’

- 12వేల మంది పోలీసులు.. 72 గంటలు
- గ్యాంగ్‌స్టర్లపై పంజాబ్ ప్రభుత్వం కఠిన చర్యలు
- పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్

**ముద్ర, పంజాబ్ :**

గ్యాంగ్‌స్టర్లు, సంస్థాగత నేరముఠాలపై పంజాబ్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ‘ఆపరేషన్ ప్రహార్’ పేరుతో 72 గంటల పాటు దాదాపు 12 వేలమంది సిబ్బందితో విస్తృత స్థాయి ఆపరేషన్ ప్రారంభించినట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. దాదాపు 1,200 మంది అనుమానితులను లక్ష్యంగా చేసుకుని, 2 వేల ప్రదేశాలలో దాడులు నిర్వహిస్తున్నామని డీజీపీ వెల్లడించారు. తమ నిఘా వర్గాలు అందించిన సమాచారంతో ఈ సిండికేట్ల నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంజాబ్‌ను పూర్తిగా నేర రహితంగా మార్చాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్‌లో పెరుగుతోన్న గ్యాంగ్‌స్టర్ సంస్కృతిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వ్యవస్థీకృత నేరాలను నిర్మూలించాలని.. ప్రజా భద్రతకు ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు ‘ఆపరేషన్ ప్రహార్’ను చేపట్టారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews


# పురపాలికల్లో 'మహిళా ఓటే' మహాశక్తి!

- -మహిళల మద్దతే కీలకం
- -మద్దతు కోసం ఆశావహుల హడావిడి

**ముద్ర, కామారెడ్డి :**





జిల్లాలో జరుగనున్న పురపాలక సంఘాల ఎన్నికల్లో మహిళా ఓటర్లే గెలుపు-ఓటములను నిర్ణయించే కీలక శక్తిగా మారారు. అధికారులు ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. కామారెడ్డి, బాన్సువాడ పురపాలక సంఘాల చైర్మన్ పీఠాలు బీసీ మహిళలకు రిజర్వ్ కావడంతో మహిళా అభ్యర్థులపై ఆసక్తి మరింత పెరిగింది. బీసీ జనరల్‌కు కేటాయించిన బిచ్కుంద, అన్‌రిజర్వ్ అయిన ఎల్లారెడ్డి పురపాలక సంఘాల్లోనూ మహిళలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశం ఉంది.

జిల్లాలో మొత్తం 92 వార్డులు ఉండగా, వాటిలో 45 వార్డులు వివిధ కేటగిరీల్లో మహిళలకు రిజర్వ్ అయ్యాయి. దీంతో ఆయా వార్డుల్లో తమ కుటుంబ సభ్యులను బరిలోకి దింపేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. మరోవైపు మహిళా ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు ఆశావహులు ఇంటింటా ప్రచారం చేపడుతున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను కలుస్తూ తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

**నజరానాలు.. హామీలు..**

మహిళల ఓట్లు దక్కించుకునేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఓ వార్డులో పోటీ చేయాలని భావిస్తున్న ఓ నేత మహిళలకు పంపిణీ చేసేందుకు 600 వెండి కుంకుమ భరణీలను ఆర్డర్ చేసినట్లు సమాచారం. రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో తన భార్యను బరిలో నిలబెట్టాలని మరో నేత ప్రయత్నిస్తున్నాడు. తమను గెలిపిస్తే ఏడాది పాటు ఉచిత కేబుల్ ప్రసారాలు అందిస్తామని, వేసవిలో నీటి సమస్య లేకుండా చూస్తామని మహిళలకు హామీలు ఇస్తున్నారు.

**ఓటర్ల గణాంకాలు ఇలా ఉన్నాయి:**

**కామారెడ్డి** : 49 వార్డులు - పురుషులు 48,389, మహిళలు 50,907, ఇతరులు 17 - మొత్తం 99,313

**బాన్సువాడ** : 19 వార్డులు - పురుషులు 11,578, మహిళలు 12,599, ఇతరులు 11 - మొత్తం 24,188

**ఎల్లారెడ్డి :** 12 వార్డులు - పురుషులు 6,321, మహిళలు 6,943, ఇతరులు 1 - మొత్తం 13,265

**బిచ్కుంద :** 12 వార్డులు - పురుషులు 6,201, మహిళలు 6,556, ఇతరులు 2 - మొత్తం 12,759

మొత్తం జిల్లాలో 92 వార్డులకు పురుషులు 72,489, మహిళలు 77,005, ఇతరులు 31గా ఉండగా, మొత్తం ఓటర్లు 1,49,525గా నమోదయ్యారు.



## అల్లమా ప్రభు జాతరలో కుస్తీల సందడి

**ముద్ర, నస్రుల్లాబాద్ :**

అల్లమా ప్రభు జాతర సందర్భంగా బొమ్మన్‌దేవుపల్లిలో మంగళవారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కుస్తీ వీరులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కుస్తీ పోటీలను వీక్షించేందుకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.



## నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు : ఏఈ సంతోష్‌కుమార్

**ముద్ర, బాన్సువాడ :**

పట్టణంలో మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ, భద్రతా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొనే విద్యుత్ సంబంధిత సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు.



## 21న మెండోరా, భీమ్‌గల్‌లో మంత్రి సీతక్క పర్యటన

**ముద్ర, బాల్కొండ :**

రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జనవరి 21వ తేదీన మెండోరా, భీమ్‌గల్ మండలాల్లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి మంగళవారం తెలిపారు. మెండోరా మండలంలోని సావెల్ నుంచి తడపాకల్ మధ్య రూ.2.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తారు రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం భీమ్‌గల్ పట్టణంలో రూ.27 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

## బైక్‌పై గంజాయి రవాణా.. ఇద్దరి అరెస్ట్

**ముద్ర, రేగోడ్ :**



రేగోడ్ మండల పరిధిలోని తాటిపల్లి గ్రామ సమీపంలో మెదక్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా, ఫ్యాషన్ బైక్‌పై గంజాయి రవాణా చేస్తూ ఇద్దరు వ్యక్తులు అధికారులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 985 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌లతో పాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గంజాయి రవాణా, కొనుగోలు, విక్రయం ఎన్డీపీఎస్ చట్టం-1985 ప్రకారం నేరమని పేర్కొంటూ నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ గాంధీ నాయక్, ఎస్సై యాదయ్య, కానిస్టేబుళ్లు గోపాల్, అనిల్, ఉమా, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## పొట్లపల్లిలో రాష్ట్రకూటుల కాలం నాటి అరుదైన నాగభూషణ శిల్పం

**ముద్ర, హుస్నాబాద్ :**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలోని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ఉన్న ఐదు పడగల నాగదేవత శిల్పం రాష్ట్రకూటుల కాలానికి చెందినదని ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, 'కొత్త తెలంగాణ చరిత్ర' బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ వివరించారు. మంగళవారం గ్రామంలోని ఎల్లమ్మగుట్ట పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అక్కడ ఉన్న నాగశిల్పాలన్నీ ఉబ్బెత్తు శిల్పాలుగా, నరనాగ శైలిలో చెక్కినవిగా ఉన్నాయని వివరించారు. ఒక శిల్పంలో నాలుగు వైపులా చెక్కిన ప్రత్యేక అర్ధశిల్పం కనిపిస్తుందని చెప్పారు. ఐదు పడగల నాగదేవత కింద కనిపిస్తున్న కుంభాన్ని 'బోనం'గా గుర్తించడంతో దీనిని 'నాగబోన శిల్పం'గా పిలుస్తారని తెలిపారు. బోనం ఎత్తడం తెలంగాణ ఆచార సంప్రదాయమని, ఇది పోచమ్మ, కాటమయ్యలకే కాక నాగులకు కూడా ఉన్న సంప్రదాయమేనని ఈ శిల్పం ద్వారా తెలుస్తోందని అన్నారు. ఈ నరనాగ శిల్పాల శైలిని బట్టి అవి రాష్ట్రకూటుల కాలం నాటివేనని నిర్ధారించినట్లు చెప్పారు. ఇప్పటివరకు లభించిన బోనం సంబంధిత చారిత్రక ఆధారాల్లో ఇదే అత్యంత ప్రాచీనమైనదని ఆయన వివరించారు.





## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగంగా పూర్తి చేయాలి

**ముద్ర, నస్రుల్లాబాద్ :**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర్ సూచించారు. మంగళవారం బొప్పాస్‌పల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసుక, మొరం కొరత ఉందా? బిల్లుల చెల్లింపులు సమయానికి వస్తున్నాయా? అనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మైలారం గ్రామంలోని పల్లె ప్రకృతివనాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈడీ వెంట ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, సర్పంచ్ బాలహరిచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, సవిత తదితరులు ఉన్నారు.



బోల్తాపడిన లారీ

## నారింజల లారీ బోల్తా ఇద్దరికి గాయాలు

**ముద్ర, నిజాంసాగర్ :**

నారింజ పండ్ల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మంగళవారం కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం నుంచి హైదరాబాద్ వైపుకు నారింజ పండ్ల లోడుతో వస్తున్న లారీ, నిజాంసాగర్ సమీపంలోని నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను పిట్లంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

**ముద్ర, సంగారెడ్డి టౌన్ :**

తమ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు మంగళవారం స్థానిక ఆర్టీసీ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కొత్త బస్టాండ్ నుంచి ర్యాలీగా రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరితగతిన విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు



## సంక్షేమంలో మహిళలకే తొలి ప్రాధాన్యం : కలెక్టర్ హైమావతి

**ముద్ర, గజ్వేల్ :**

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకే తొలి ప్రాధాన్యం ఉంటుందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల సందర్భంగా మంగళవారం గజ్వేల్ సమీకృత కార్యాలయంలో పట్టణ మహిళలకు ఇందిరమ్మ చీరలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు, జిల్లా వ్యాప్తంగా 12,500 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో 90 శాతం పనులు గ్రౌండింగ్ పూర్తయ్యాయని, 80 శాతం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు ఇప్పటికే జమయ్యాయని చెప్పారు. ఇందిరమ్మ చీరలు కేవలం మహిళా సంఘాల సభ్యులకే మాత్రమే అన్న అపోహలు అవసరం లేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు చీరల పంపిణీ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.



## వాసవీ మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు

**ముద్ర, సిద్దిపేట :**

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కుంకుమ పూజ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చినా భయపడం

- న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉంది
- ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు, సుప్రీంకోర్టులు కొట్టేశాయి
- అయినా కాంగ్రెస్ సిట్ తో విచారణ జరుపుతూ వేధిస్తోంది
- రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి కోల్ టెండర్లు అప్పజెప్పే ప్రయత్నం
- మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ముద్ర, హైదరాబాద్ :**

విచారణ, కమిషన్ల పేరుతో మా పార్టీ నేతలను వేధిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాజకీయ వేధింపుల్లో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావుకు నోటీసులు ఇచ్చారన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారనే ప్రచారం జరుగుతుందని చెప్పిన ఆయన.. ఒకవేళ నోటీసులు ఇచ్చినా భయపడేది లేదన్నారు. ఏం చేస్తారో చేసుకోండని సవాల్ చేశారు. ఈ దేశంలో న్యాయం ఇంకా బతికే ఉందనీ తమకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు లొట్టపీసు కేసు అని దుయ్యబట్టారు. ఈ కేసును హైకోర్టు, సుప్రీంకోర్టులు కొట్టేసినా కూడా సిట్ ఏర్పాటు చేసిన విచారణ జరిపిస్తున్నారని ధ్వజమెత్తారు. కొంత మంది అధికారులు రేవంత్ రెడ్డి ఆడిస్తున్నట్లు ఆడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాలం ఎప్పుడు ఒకే రకంగా ఉండదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఎమర్జెన్సీ అయితే మీరంతా ఇక్కడ ఉన్న వారా అంటూ ఓ అధికారి మాట్లాడుతున్నారని చెప్పారు. అలాంటి ఆలోచనతో ఉన్న అధికారులు తమ ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. తమను ఎంత వేధిస్తారో వేధించండి రేవంత్ రెడ్డిని, ఆయన చెప్పినట్లు ఆడుతున్న అధికారులను వదిలే ప్రసక్తే లేదని కేటీఆర్ హెచ్చరించారు. డైవర్షన్ పాలిటిక్స్ రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు.

**బొగ్గు టెండర్లపై మాట్లాడగానే హరీశ్ కు నోటీసులు**

రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి కోల్ టెండర్లు దక్కేలా ప్రయత్నాలు జరిగాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయాన్ని హరీశ్ రావు ఈ నెల 19న మాట్లాడగానే వెంటనే ఆయనకు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు సింగరేణి స్కామ్ ను ఆధారాలతో సహా బయటపెడతామన్నారు. సైట్ విజిట్‌కు వచ్చిన కంపెనీలకు సృజన్ రెడ్డి స్వయంగా బెదిరిస్తున్నారని ఆరోపించారు. నైనీ కోల్ బ్లాక్ రద్దు వెనుక వాటాల పంచాయతీ ఉందన్నారు. ఒక ముఠాగా ఏర్పడి సింగరేణి టెండర్లలో గోల్ మాల్ జరిగిందని ఈ విషయాన్ని హరీశ్ రావు బయటపెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని బంగారు బాతులా చూస్తోందన్నారు. సింగరేణిలో ఇంత జరుగుతుంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరగాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

## జూబ్లీహిల్స్ వద్ద హైటెన్షన్

- గంటల తరబడి హరీష్ రావు విచారణ..
- బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన



**ముద్ర, హైదరాబాద్:**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత తన్నీరు హరీష్ రావు విచారణ ఉదంతం రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. సిట్ (సిట్) విచారణ పేరుతో పోలీసులు ఆయనను పిలిపించి, గంటలు గడుస్తున్నా బయటకు వదలకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు రణరంగంగా మారాయి.

**పోలీసుల తీరుపై న్యాయవాదుల ఆగ్రహం**

విచారణ ఎంతసేపు కొనసాగుతుంది? ఎప్పుడు ముగుస్తుంది? అనే కనీస సమాచారం ఇవ్వకుండా పోలీసులు గోప్యత పాటిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. సమాచారం అడిగేందుకు ప్రయత్నించిన న్యాయవాదులు, పార్టీ నేతలపై పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య విరుద్ధమని వారు ఆరోపిస్తున్నారు.

**ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్.. ఉద్రిక్తత**

ఈ ఆందోళనల క్రమంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసే ప్రయత్నం చేశారు. ఈ తోపులాటలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురై పోలీస్ స్టేషన్ ముందే స్పృహ తప్పి పడిపోయారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా ఆగ్రహానికి లోనయ్యారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

**తరలివస్తున్న అభిమానులు.. సిద్దిపేట టూ హైదరాబాద్**

హరీష్ రావుకు మద్దతుగా రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివస్తున్నారు. ముఖ్యంగా ఆయన నియోజకవర్గమైన సిద్దిపేట నుండి సుమారు 5 బస్సులు, వందలాది కార్లలో కార్యకర్తలు విచారణ కార్యాలయానికి చేరుకునేందుకు సిద్ధమయ్యారు.పోలీసుల అత్యుత్సాహం, విచారణ పేరిట వేధింపులు ఆపాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. రాబోయే గంటల్లో ఈ ఉద్రిక్తత మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

### మీది కాంగ్రెస్ కాదు.. స్కామ్ గ్రెస్

# సిట్ విచారణ కాదు.. పిచ్చి విచారణ.. నిలదీస్తే కేసులా..?

- లీకులతో ఇంకెన్ని రోజులు కాలం గడుపుతారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ముద్ర, హైదరాబాద్ :**




ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును సిట్ విచారించడం సిట్ విచారణ కాదని, పిచ్చి విచారణ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన..న్యాయం కోసం తాము హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకైనా వెళతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక నిలదీసిన వారిపై కేసులు నమోదు చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి టెండర్ల కుంభకోణంలో అసలు సూత్రధారి సీఎం బావమరిది సృజన్‌రెడ్డేనని ఆరోపించారు. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసు పసలేని కేసు అని గతంలో సుప్రీంకోర్టే చెప్పింది. అయినా గూడా ఆ కేసును సాగదీయడంలో అర్థం ఏముంది..? ఈ కేసుకు సంబంధించి సిట్‌గానీ, సర్కారుగానీ ఒక్క ప్రెస్‌మీట్ అయినా పెట్టి అధికారికంగా మాట్లాడిందా..? ఒక్కరిపైన అయినా నేరం రుజువైందా..? తప్పు జరిగింది అంటరు. మరి ఎందుకు నిరూపించలేకపోతున్నరు..?' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

**మాకు బాధ్యత ఉంది.. అందుకే వెళ్తాం**

ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు బాధ్యతాయుతమైన నాయకుడిగా హరీష్ రావు సిట్ విచారణకు హాజరయ్యారని, తాము ఎటూ పారిపోమని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డికి డబ్బుల కట్టలతో దొరికిన నేరచరిత్ర ఉన్నదని, అదే తరహా కేసుల్లో అదే అందరికీ అది అంటించాలని చూస్తున్నాడని, అడ్డగోలు సిట్ విచారణల పేరుతోనే ఎన్ని రకాల తమాషాలు చేసినా కాంగ్రెస్ పార్టీ హామీల వైఫల్యం, పరిపాలన వైఫల్యంపై ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అధికారం అందలం ఎక్కిచ్చిన బుద్ధి మాత్రం బురదలోనే రేవంత్ రెడ్డిదే ఉన్నదని, కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కామ్ గ్రెస్... ఒక మంత్రి 20% శాతం, ఇంకో మంత్రి బ్యాగ్ మాన్ ఇలా రేవంత్ రెడ్డి తన మంత్రులందరికీ డబ్బుల సంచి పంపించినట్లు ఉన్నారని, అందుకే డిప్యూటీ సీఎం భట్టి సహా అంతా మౌనంగా ఉంటున్నారన్నారు. ఈ మొత్తం ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఒక్క అధికారి కూడా ఇప్పటిదాకా ఎందుకు బయటకు మాట్లాడలేదని కేటీఆర్ ప్రశ్నించారు.

**లీకులతో ఇంకెన్ని రోజులు బతుకుతారు**

ఆ విచారణ.. ఈ విచారణ.. ఆయన అవినీతి, ఈయన రాసలీలలు అంటూ కేవలం లీకులు ఇచ్చి ఎన్ని రోజులు ఇలా బతుకుతావని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, అధికారిక సమాచారం లేకుండా ఎన్ని రోజులు ఈ తమాషాలు నడిపిస్తారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఒక్క అధికారిక ప్రకటన రాలేదని, గతంలో హరీష్‌రావుపై నమోదైన అక్రమ ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. కేవలం హరీష్‌రావుపై కుట్రతో జైలుకు పంపించాలన్న దురుద్దేశంతోనే సుప్రీంకోర్టులో ప్రజల డబ్బులు పెట్టి మరీ ప్రభుత్వం వాదించిందన్నారు. తాజాగా హరీష్‌రావు..సీఎం బావమరిది బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందువల్లనే సాయంత్రం వరకూ నోటీసులు హరీష్ రావుకు ఇచ్చారన్నారు. హరీష్ రావు బొగ్గు కుంభకోణంలో బయటపెట్టిన సమాచారం తప్పు అయితే సంబంధిత మంత్రి, సింగరేణి అధికారులు ఇప్పటిదాకా ఒక్కరూ ఎందుకు మాట్లాడలేదని కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ కుంభకోణాలను బయటపెట్టిన ప్రతిసారి రాష్ట్ర ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నదని మండిపడ్డారు.

## పొలిటికల్ ట్యాపింగ్..?!

- సిట్ విచారణకు మాజీ మంత్రి హరీష్
- గతంలోనే ఇదే కేసులో ఊరట
- మళ్లీ నోటీసులిచ్చి విచారణకు పిలిచిన సిట్
- అధికార, విపక్షం మధ్య రాజుకున్న నిప్పు

**ముద్ర, హైదరాబాద్ :**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది.ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు జారీ చేయడంతో పరిస్థితి మారిపోయింది. మంగళవారం ఉదయం హరీశ్ రావు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు.ఆయనను సీపీ సజ్జనార్ నేతృత్వంలోని సిట్ అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. హరీష్ రావుతో పాటు వెళ్లిన ఆయన న్యాయవాదులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. నోటీసులు ఇచ్చిన కేసులో హరీశ్ రావుకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని ఆయన తరపు న్యాయవాదులు స్పష్టం చేశారు. ఇది పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో సాగుతున్న ప్రక్రియ అంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. మరోవైపు, హరీష్ రావును దాదాపు 7 గంటలు విచారించిన సిట్..మళ్లీ పిలుస్తామంటూ వదిలేసింది.

**గతంలోనే కోర్టుకు..?**

హరీష్‌రావుపై గతంలో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. ఆ కేసులో హరీశ్ రావు నేరుగా ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు ఇచ్చారని, కుట్రలో భాగమయ్యారని చెప్పేందుకు సరైన ఆధారాలు లేవని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల దానిని కొనసాగించడం చట్టబద్ధం కాదని పేర్కొంటూ హైకోర్టు కేసును కొట్టివేసింది.హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా ప్రభుత్వానికి ఊరట లభించలేదు. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో ఆ నిర్దిష్ట ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తిగా ముగిసినట్టయ్యింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే హరీశ్ రావు గతంలో "హైకోర్టు, సుప్రీంకోర్టులు చెంప చెల్లుమనేలా తీర్పు ఇచ్చాయి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**ప్రభుత్వం వాదన ఏంటి..?**

అయితే, తాజాగా హరీష్‌రావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ అనూహ్య పరిణామంతో రాజకీయాల్లో చర్చగా మారింది. ఇప్పుడు జరుగుతున్న దర్యాప్తు ఏంటి? అని చాలా మందిలో సందేహాలు ఉన్నాయి. ప్రస్తుత దర్యాప్తుపై స్పష్టత అవసరమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టులు కొట్టివేసింది ఒక్క ఎఫ్ఐఆర్ మాత్రమేనని, మొత్తం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జరగలేదని ఎక్కడా కోర్టులు చెప్పలేదని ప్రభుత్వం వాదిస్తోంది. అందుకే కొత్త కోణంలో, విస్తృత స్థాయిలో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై సిట్ విచారణ కొనసాగుతోందని అధికారులు వివరిస్తున్నారు. ఈ విచారణలో భాగంగానే హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం.

**బీఆర్ఎస్ వాదన ఏమిటి?**

హరీశ్ రావు సహా బీఆర్ఎస్ నేతల వాదన మాత్రం భిన్నంగా ఉంది. కోర్టులు ఇప్పటికే కొట్టివేసిన కేసునే మళ్లీ తిరగదవ్వడం ద్వారా రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యలు, అవినీతి అంశాల నుంచి దృష్టిని మళ్లించేందుకే ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తిరిగి తెరపైకి తెచ్చారని విమర్శిస్తున్నారు.మొత్తానికి, కోర్టుల తీర్పులు ఒకవైపు, సిట్ దర్యాప్తు మరోవైపు కొనసాగుతుండటంతో ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాల్లో ఇంకా ఎంత దూరం వెళ్తుందో చూడాల్సిందే.

**హరీష్ రావును అరెస్ట్ చేస్తారా?..**

దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో తొలిసారిగా బీ



ఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్‌రావుకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న అనంతరం హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పేరిట ప్రభుత్వం రాజకీయ డైవర్షన్‌కు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. అవినీతి అంశాలపై ప్రశ్నిస్తే ఇలాగే కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి తన బావమరిది వ్యవహారాలు బయటపడగానే, అదే రోజున రాత్రి సిట్ నోటీసులు రావడం యాదృచ్ఛికం కాదన్నారు. తాను తాటాకు చప్పుళ్లకు భయపడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు చూసి సీఎం భయపడుతున్నారని, మున్సిపల్ ఎన్నికల్లో భారాస మరింత బలపడుతుందన్న ఆందోళనతోనే ఈ చర్యలన్నీ జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.

**హరీష్ రావుకు ఈ కేసుతో లింక్ ఏంటి?**

దర్యాప్తులో భాగంగా, శ్రవణ్‌రావు, ప్రభాకర్‌రావు, ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపై సిట్ దృష్టి సారించింది. ఒక ప్రైవేట్ కార్యక్రమంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు, ప్రభాకర్‌రావులు కలుసుకున్న సమయంలో ఎన్నికల సర్వేల అంశం చర్చకు వచ్చిందని శ్రవణ్‌రావు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. కొన్ని కీలక నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారికి సహకరిస్తున్న వ్యక్తుల ఫోన్ నంబర్లు సేకరించి నిఘా కోసం వినియోగించారన్న అనుమానంతో సిట్ విచారణ కొనసాగుతోంది. ఈ మొత్తం వ్యవహారానికి హరీశ్‌రావు-ప్రభాకర్‌రావుల భేటీనే బీజంగా భావిస్తూ, నిజానిజాలు తెలుసుకునేందుకే సిట్ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది.

## పెండింగ్ చలాన్లు కట్టమని వాహనదారులను బలవంతపెట్టొద్దు

- చలాన్ల విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- స్వచ్ఛందంగా చెల్లిస్తేనే వసూలు చేయాలి.
- చెల్లించకపోతే నోటీసులు ఇవ్వాలని వ్యాఖ్యానించిన హైకోర్టు

**ముద్ర, హైదరాబాద్ :**

పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్ల వసూలు విషయంలో తెలుంగాణ కీలక వ్యాఖ్యలు చేసింది. చలాన్లు కట్టమని వాహనదారులను బలవంతపెట్టడం సరైంది కాదని స్పష్టం చేసింది. చలాన్లను వసూలు చేయాలంటే వాహనదారులు స్వచ్ఛందంగా చెల్లించినప్పుడే తీసుకోవాలని పేర్కొంది. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై వాహనాలను ఆపి, పెండింగ్ చలాన్లు ఉన్నాయంటూ అక్కడికక్కడే చెల్లింపులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని కోర్టు దృష్టికి వచ్చింది. ఈ విధానం చట్టబద్ధం కాదని హైకోర్టు అభిప్రాయపడింది. చలాన్లు చెల్లించని పక్షంలో నిబంధనల ప్రకారం ముందుగా నోటీసులు జారీ చేయాలని, ఆ తర్వాతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రజల హక్కులను గౌరవిస్తూ, న్యాయపద్ధతుల్లోనే వ్యవహరించాలని ట్రాఫిక్ అధికారులకు హైకోర్టు సూచనలు చేసింది. చలాన్ల వసూలు పేరుతో వాహనదారులను ఇబ్బందులకు గురిచేయకూడదని, చట్ట పరిధిలోనే చర్యలు ఉండాలని స్పష్టం చేసింది.ఈ వ్యాఖ్యలతో ట్రాఫిక్ చలాన్ల వ్యవహారంలో వాహనదారులకు కొంత ఊరట లభించినట్లయింది.

## కార్పొరేట్ శక్తులు పార్లమెంటరీ డెమోక్రసీకి సవాల్ విసురుతున్నాయి

- ఫాసిస్టులు, క్యాపిటలిస్టులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేద్దాం
- తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికి కొత్త సందేశాన్ని ఇచ్చింది
- ఖమ్మంలో సిపిఐ జాతీయ సెమినార్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ముద్ర, ఖమ్మం :**

మతం అనే సెంటిమెంటు పేరుతో ప్రస్తుతం దేశంలో ఆర్థిక, సామాజిక అంశాలను తప్పుదోవ పట్టించి కార్పొరేట్ , ఫాసిస్టు శక్తులు పార్లమెంటరీ డెమోక్రసీకి ఛాలెంజ్ విసురుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన ఖమ్మం జిల్లా కేంద్రంలో సిపిఐ శత వసంతాల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ లో ప్రసంగించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి చాలెంజ్ విసురుతున్న కార్పొరేట్ శక్తులను, దేశంలో ఆర్థిక సామాజిక అంశాలను తప్పుదోవ పట్టిస్తున్న ఆశక్తులను ఐక్య పోరాటాల ద్వారా అడ్డుకట్ట వేద్దాం కలసి ముందుకు పోదామని వామపక్ష పార్టీలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. దోపిడీ వర్గాలు, దోపిడీకి గురయ్యే వర్గాల మధ్య కాకుండా దేశంలో మారిన రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వామపక్షాలు ముందుకు కదలాలి అన్నారు. వర్గ పోరాటం ద్వారానే సోషలిజం సాధ్యమని కార్లు మార్క్స్ చెప్పాడు కానీ భారతదేశ మార్క్స్ అంచనాలకు మినహాయింపుగా మిగిలింది భారతదేశ సమాజం వర్గాలపై కాకుండా కులాలపై నిర్మితమైందని జర్మన్ ఫిలాసఫర్ మార్క్స్ వెబర్ స్పష్టంగా చెప్పాడని సెమినార్లో డిప్యూటీ సీఎం వివరించారు. వర్గ పోరు అనేది లేకుండా చేసి పార్లమెంటు వ్యవస్థ ప్రశ్నార్థకమైన నేపథ్యంలో కమ్యూనిస్టుల పాత్ర ఈ దేశంలో చాలా ప్రముఖమైనదని తెలిపారు. ఖమ్మం జిల్లా అనేక రకాల భావజాలాల వ్యాప్తికి ఆహ్వానం పలుకుతుంది, ఆతిథ్యానికి మారుపేరు ఖమ్మం, దేశవ్యాప్తంగా ఉన్న వామపక్షా నేతలు ఖమ్మం జిల్లాలో సమావేశం కావడానికి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నానని, అభినందిస్తున్నానని తెలిపారు. 100 సంవత్సరాల సిపిఐ చరిత్రలో ఎన్నో త్యాగాలు, ఆటుపోట్లు ఉన్నాయి ఈ దేశానికి స్వాతంత్రం సాధించడంలో సిపిఐది ప్రముఖస్థానం అన్నారు. భారతదేశం అంతటికీ 1947లో స్వాతంత్రం వస్తే తెలంగాణ ప్రాంతానికి ఒక సంవత్సరం తర్వాత స్వాతంత్రం సిద్ధించింది నిరంకుశ నిజాం రాజును వ్యతిరేకించి కమ్యూనిస్టులు చేసిన సాయుధ పోరాటం ప్రపంచానికి కొత్త సందేశాన్ని ఇచ్చింది అని వివరించారు. భూమికోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం.. దున్నేవానిదే భూమి, గ్రంథాలయ ఉద్యమం వంటి గొప్ప పోరాటాలతో తెలంగాణ విలసిల్లింది అన్నారు. ప్రధానంగా ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలో ఏ ఇంటి తలుపు తట్టిన ఒక పోరాట గాథ వినిపిస్తుంది అన్నారు. కాంగ్రెస్ పాలకులు బూర్గుల రామకృష్ణారావు 1950లో కౌలు గారి చట్టాన్ని తీసుకువచ్చారు, ఆ తర్వాత అందులో 19 70లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం భూ సంస్కరణల చట్టం, పేదల అభివృద్ధికి 20 సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయ కరణ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం వంటి గొప్ప చట్టాలను వామపక్ష పార్టీల సహాయంతో కాంగ్రెస్



ప్రభుత్వాలు ఈ దేశంలో రాష్ట్రంలో తీసుకు రాగలిగాయి అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది లేదంటే సగటుకు మనిషికి హక్కులు దక్కకుండా పోతాయి, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓటు హక్కును నాశనం చేస్తుంది, రాజ్యాంగంలో మార్పుల కోసం ప్రయత్నాలు చేస్తుంది కాంగ్రెస్, వామపక్ష పార్టీలు కలిసి ఈ దేశంలో సుదీర్ఘ రాజకీయ ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు గుర్తు చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






# బాచుపల్లిలో 2.30 ఎకరాల పార్కును కాపాడిన హైడ్రా

- రూ. 300ల కోట్ల విలువైన భూమికి ఫెన్సింగ్

**ముద్ర, హైదరాబాద్:**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని బాచుపల్లిలో 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఆ పక్కనే తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించిన 30 గుంటల ప్రభుత్వ భూమిని కూడా కబ్జాల చెర నుంచి హైడ్రా విడిపించింది. సర్వే నంబర్ 142, 143, 144లో ఉన్న 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని 2016లో అప్పటి కలెక్టర్ పార్కు కోసం కేటాయించారు. మొక్కలు నాటి పార్కును అభివృద్ధి చేశారు. అర్బన్ నర్సరీని ఏర్పాటు చేశారు. వందలాది మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచారు. బోర్‌వెల్, వాటర్ సంప్, వాచ్‌మన్ గది, ఇనుప గేట్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. 2023లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పార్కులోని మొక్కలను ధ్వంసం చేసి నర్సరీని తొలగించారు. తమ ల్యాండ్‌గా చెబుతూ రాత్రికి రాత్రి ప్రహరీ నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా పరిశీలించింది. పార్కు స్థలంగానే నిర్ధారించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆక్రమణలను తొలగించింది. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. అదే సర్వే నంబర్లలో 30 గుంటలు తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించిన స్థలం కూడా కబ్జాలకు గురైతే.. ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 30 గుంటల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కు స్థలాన్ని కాపాడడంతో బాచుపల్లి నివాసితులు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు. హైడ్రా, ప్రభుత్వానికి మద్ధతుగా నినాదాలు చేశారు.

# ప్రభుత్వ చేయూతతో మారిన గ్రామీణ మహిళ జీవితం

- జేసీబీ నడిపి అడ్డంకులను అధిగమించిన పాలమాకుల అరుణ
- ఎస్ హెచ్ జిల సహకారంతో ధైర్యంగా ముందడుగు
- ఆత్మవిశ్వాసం, శ్రమతో సాధించిన విజయం
- ఇతర మహిళలకు ప్రేరణగా నిలిచిన అరుణ..
- జేసీబీ నడుపుతున్న అరుణ ధైర్యం ప్రతి మహిళకు స్ఫూర్తి- మంత్రి సీతక్క

**ముద్ర, హైదరాబాద్:**



జేసీబీ వంటి భారీ యంత్రాలు పురుషులే నడపాలి అన్న భావనకు చెక్ పెట్టిన మహిళ పాలమకుల అరుణ. కుటుంబ బాధ్యత, ఆత్మవిశ్వాసం, స్వయం శక్తితో నిలబడాలనే తపనతో ఆమె ఈ ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రజా ప్రభుత్వ ప్రోత్సాహంతో నేడు ఆమె ప్రయాణం గ్రామీణ మహిళలకు ప్రేరణగా మారింది.

జనగాం జిల్లా ఎరుగొల్లపాడు గ్రామానికి చెందిన అరుణ పదో తరగతి వరకు చదివారు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోవడంతో జీవితం కష్టంగా మారింది. 2012లో పాలమకుల నాగరాజును వివాహం చేసుకున్నా, రెండు కుటుంబాల నుంచి ఎలాంటి మద్దతు లభించలేదు. దీంతో తమ జీవితాన్ని తామే నిర్మించుకోవాల్సి వచ్చింది. అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో జీవితం సాగింది. నాగరాజు కుటుంబ బాధ్యతల కోసం జేసీబీ డ్రైవింగ్ నేర్చుకుని డ్రైవర్‌గా పని చేశారు. అదే సమయంలో అరుణ వ్యవసాయ కూలీగా పనిచేశారు. అరుణ కుట్టు పనులు కూడా చేసి జీవనాన్ని సాగించింది.

అయితే 2013లో అరుణ స్వయం సహాయక సంఘంలో చేరారు. ఇది ఆమె జీవితంలో కీలక మార్పుకు కారణమైంది. 2014లో ఎస్ హెచ్ జి ద్వారా రూ. లక్ష రుణం తీసుకుని పాత అప్పులు తీర్చగలిగారు. క్రమం తప్పకుండా పొదుపు చేయడం, రుణాలు చెల్లించడం వల్ల కుటుంబానికి కొంత ఆర్థిక స్థిరత్వం వచ్చింది.

**జేసీబీ కొనుగోలుతో మారిన జీవితం..**

2019లో ఎస్ హెచ్ జి బ్యాంక్ లింకేజ్, గ్రామ సంఘం, స్త్రీ నిధి సహకారంతో జేసీబీ కొనుగోలు చేశారు. ఇది గ్రామంలో మొదటి జేసీబీ కావడం విశేషం. గ్రామస్థుల సహకారంతో పనులు లభించాయి. క్రమశిక్షణతో అప్పులన్నీ పూర్తిగా తీర్చారు. భర్త ప్రోత్సాహంతో అరుణ స్వయంగా జేసీబీ నడపడం నేర్చుకున్నారు. 2024లో విజయవంతంగా జేసీబీ డ్రైవింగ్ పూర్తి చేశారు. మొదట అనుమానంగా చూసిన వారు నేడు ఆమెను అభినందిస్తున్నారు. "భర్త యజమాని, భార్య డ్రైవర్ - మీరు ఇద్దరూ సరైన జోడి" అని గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.

ఎస్ హెచ్ జిల సహాయంతో అరుణ కుటుంబం ఇప్పటివరకు రూ.22.10 లక్షల వరకు రుణాలు పొందింది. వ్యవసాయం, కిరాణా దుకాణం, టాటా ట్రాలీ వాహనం, ద్విచక్ర వాహనం, బ్యాగుల తయారీ యూనిట్ వంటి పనుల ద్వారా కుటుంబం స్వయం ఆధారంగా నిలబడింది. ప్రస్తుతం జేసీబీ ద్వారా గంటకు రూ.1,000-1,200 వరకు ఆదాయం పొందుతూ రోజుకు సగటున రూ. 4,000 నుంచి రూ. 5,000 ఆదాయాన్నిపొందుతున్నారు.

అరుణ ఎస్ హెచ్ జి గ్రూప్ లీడర్‌గా, వీవో, మండల సమాఖ్య అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. ఆమె నాయకత్వంలో గ్రామంలోని అనేక మహిళలు స్వయం ఉపాధి పొందారు. ఎస్ హెచ్ జి ల ద్వారా వస్త్ర దుకాణాలు, పిండి మిల్లులు, గాజుల దుకాణాలు ప్రారంభించారు. దీంతో వారి జీవితాలు మారిపోయాయి. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు. దీంతో గ్రామస్తులంతా అరుణను అభినందిస్తున్నారు.

సమాఖ్య అధ్యక్షురాలిగా స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవాల్లో జాతీయ పతాకాన్ని ఎగరవేయడం తనకు గర్వంగా ఉందని అరుణ చెబుతున్నారు. చిన్నప్పుడు అంగన్‌వాడీ టీచర్ కావాలన్న కల, నేడు మహిళా నాయకురాలిగా నిజమైందన్నారు. హ్యాండ్ లోన్లతో జీవితం మొదలుపెట్టి, నేడు జేసీబీ నడిపే స్థాయికి చేరిన తన ప్రయాణం ఎస్ హెచ్ జిల శక్తికి గొప్ప ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఎస్ హెచ్ జి లు, బ్యాంకు లింకేజీ లోన్లు, ప్రభుత్వ చేయూత లేకపోతే..తన జీవితం కూలీగానే ముగిసిపోయేదన్నారు.

> పాలమాకుల అరుణ జీవితం గ్రామీణ మహిళల శక్తికి మంచి ఉదాహరణ. ఎస్ హెచ్ జి ల ద్వారా మహిళలు ఆర్థికంగా మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారనడానికి ఆమె నిదర్శనం. ప్రభుత్వం అవకాశం కల్పిస్తే మహిళలు ఏ రంగంలోనైనా రాణిస్తారు. ఈ మధ్య సెర్ప్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో అరుణను కలిశాను. జేసీబీ నడుపుతున్న ఆమె ధైర్యం ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకం. ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడి ఈ స్థాయికి అరుణ ఎదగడం ఆనందగా ఉంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా లక్షలాది మంది అరుణలను తయారు చేయడమే మా ప్రజా ప్రభుత్వ సంకల్పం
>
> **-సీతక్క, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి**

# తేల్చుకుందాం రా..

- సీఎం రేవంత్ కు మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- దమ్ముంటే రాజకీయంగా తలపడు
- నోటీసులతో భయపెట్టలేవు
- ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో సిట్ విచారణకు హరీశ్ రావు
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఏడు గంటల విచారణ
- పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల తోపులాట

**ముద్ర, హైదరాబాద్:**

రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మాజీ మంత్రి హరీశ్‌రావును సిట్ అధికారుల బృందం మంగళవారం ఏడు గంటలపాటు విచారించింది. ఇందులో మునుగోడు ఉప ఎన్నికల సమయంలో శ్రవణ్‌రావుకు కొన్ని నంబర్లు ఇచ్చి ట్యాప్ చేయించారని హరీశ్ రావుపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శ్రవణ్‌రావుకు డైరెక్షన్స్ ఇవ్వడం వెనుక ఉన్నదెవరు? ఈ కేసులో నిందితులైన రాధాకిషన్‌రావు, ప్రభాకర్‌రావుతో హరీశ్‌రావుకు ఉన్న సంబంధాలు ఏంటి? ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు అసలు సూత్రధారులు ఎవరు? అనే అంశాలపై దర్యాప్తు బృందం ప్రశ్నించింది. ఈ కేసులో తొలిసారి సిట్ ఎదుట హాజరైన హరీశ్‌రావు నుంచి సిట్ అధికారులు కీలక విషయాలు రాబట్టే ప్రయత్నం చేసింది.

**నేనే వందల ప్రశ్నలు అడిగా..**

సిట్ అధికారులు తనను ప్రశ్నించడం కాదనీ, తానే వారికి వందల ప్రశ్నలు వేశానని హరీష్ రావు చెప్పారు. అప్పటి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్ లను విచారణకు పిలవాలని సూచించానన్నారు. శివధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి లను విచారణకు పిలవాలి అని డిమాండ్ చేశానన్నారు. తమ పాలనలో జరిగిన ఫోన్ టాపింగ్‌కు తనకేం సంబంధం అని సిట్ అధికారులను ప్రశ్నించానన్నారు. అప్పట్లో తాను హోం మంత్రి కాదనే విషయాన్ని గుర్తు చేశానన్నారు. బొగ్గు టెండర్ల అంశంపై సైట్ విజిట్ సర్టిఫికేట్ పేరుతో జరిగిన కుంభకోణాన్ని తాము బట్టబయలు చేశామని చెప్పారు. ప్రతి దానికి సిట్‌లు వేస్తున్న ప్రభుత్వం దానిపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిజాయితీపరుడివి అయితే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మంత్రులు, నాయకులందరూ టెండర్ల కోసం కొట్లాడుకుంటున్నారని, అందుకే ఈ అవినీతి బాగోతం బయటపడింది అని హరీష్‌రావు అన్నారు.

**న్యాయవ్యవస్థపై నాకు నమ్మకం ఉంది**

విచారణ ముగిసిన అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న హరీష్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఉద్యమ స్ఫూర్తితోనే తమ పార్టీ ఏర్పాటు అయిందన్నారు. తమకు ఉద్యమాలు కొత్త కాదని చెప్పారు. కాంగ్రెస్ నేతల మాదిరిరిగా తాము పారిపోలేదని విమర్శించారు. సమైక్య రాష్ట్రంలో అక్రమ కేసులు చాలా పెట్టారన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన నోటీసులను తాము గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఉదయం మీ బామ్మర్ది బాగోతం బయట పెడితే సాయంత్రం తనకు నోటీసులు ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డిపై పరోక్ష ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి... నీకు దమ్ముంటే నాకు నోటీసులు ఇవ్వడం కాదు... రాజకీయంగా కొట్లాడుదామని హరీశ్ రావు సవాల్ విసిరారు. నీ దోపిడీకి అడ్డు వస్తున్నామని చిల్లర రాజకీయాలు చేస్తున్నావంటూ ధ్వజమెత్తారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గర లోనే ఉన్నాయన్నారు. తమకు చట్టం మీద నమ్మకం, గౌరవం ఉందని చెప్పిన హరీశ్ రావు.. నువ్వు ఎక్కడకు పిలిచినా వస్తానన్నారు. రాత్రి మళ్లీ మరో లీక్ ఇస్తారని, దమ్ముంటే సిట్ అధికారులు తనను అడిగిన ప్రశ్నలు జవాబులు అన్ని బయటపెట్టాలని హరీష్ రావు అన్నారు. ఈ నోటీసులు తమను బయటపెట్టవని, నీ పతనాన్ని వేగవంతం చేస్తాయని ధ్వజమెత్తారు.

**మునుగోడు బైపోల్ చుట్టూ ప్రశ్నలు..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 మార్చిలో ఎస్ఐబీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ప్రస్తుతం హరీశ్‌రావును సిట్ విచారిస్తోంది. ఈ కేసులో ఫైనల్ చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ కేసులో అధికారులను ఇప్పటికే విచారించగా రాజకీయ నాయకుల పాత్ర ఏంటనేది మాత్రమే మిగిలి ఉంది. ఇందులో భాగంగా తాజాగా హరీశ్‌రావును సిట్ టీమ్ మంళవారం విచారించింది, అయితే మునుగోడు ఉప ఎన్నికల సమయంలో శ్రవణ్‌రావుకు కొన్ని నంబర్లు ఇచ్చి ట్యాప్ చేయించారనేది ప్రధానంగా హరీశ్‌రావుపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శ్రవణ్‌రావుకు డైరెక్షన్స్ ఇవ్వడం వెనుక ఉన్నదెవరు? ఈ కేసులో నిందితులైన రాధాకిషన్‌రావు, ప్రభాకర్‌రావుతో హరీశ్‌రావుకు ఉన్న సంబంధాలు ఏంటి? ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు అసలు సూత్రధారులు ఎవరు? అనే అంశాలపై దర్యాప్తు బృందం ప్రశ్నించింది.

**పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత..**

సిట్ అధికారులు హరీశ్ రావును విచారిస్తున్న సమయంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పరిస్థితి ముదిరి పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు.

# పెట్టుబడులకు ఏపీని మించింది లేదు

- రాష్ట్రానికి రండి... పరిస్థితులు గమనించండి
- దావోస్ వేదికపై పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు పిలుపు
- 'ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్' అంశంపై సీఎం ప్రసంగం

**ముద్ర, దావోస్ (స్విట్జర్లాండ్):**

ఏపీని మించిన అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానం మరొకటి లేదని, పారిశ్రామికవేత్తలకు రాష్ట్రం అతిపెద్ద మార్కెట్ అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్‌లోని వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికపై అన్నారు. ఏపీకి వచ్చి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పాలసీలు, పెట్టుబడులకు ఉన్న సానుకూల పరిస్థితుల్ని స్వయంగా పరిశీలించాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను చూశాకే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి భారత్ ప్రపంచ శక్తిగా మారుతుందని, అందులో ఏపీ మొదట నిలుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. దావోస్ పర్యటనలో రెండో రోజు జరిగిన 'ది ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్' అంశంపై సీఐఐ బ్రేక్ ఫాస్ట్ సెషన్‌లో సీఎం ప్రసంగించారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీ ఆకర్షించినట్టు చెప్పారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఇంధనం, డిజిటల్ ఇన్ ఫ్రా, లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులకు నెలకొన్న అవకాశాలపై సెషన్‌లో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు, తదితర రంగాల్లో పెట్టుబడుల గురించి ముఖ్యమంత్రి వివరించారు. గ్రీన్ అమ్మోనియా, గూగుల్ పెట్టుబడులు, ఏపీ బ్రాండ్ ఇమేజ్ గురించి పారిశ్రామిక వేత్తలకు తెలిపారు. స్పేస్ సిటీ, పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవే కనెక్టివిటీ తదితర అంశాలపై దృష్టి పెట్టినట్టు చెప్పారు. ఏపీలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అన్ని విధాలుగా సహకరిస్తోందని, వ్యవసాయం రంగంతో పాటు వైద్య రంగంలోను డ్రోన్లను ఉపయోగిస్తామని సీఎం చెప్పారు. 2026లో డ్రోన్ అంబులెన్స్ కూడా ఏపీ నుంచి లాంచ్ చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. 1,054 కిలోమీటర్ల సముద్ర తీరం, పోర్టులు, ఎయిర్ పోర్టులు ఏపీ బలమని చెప్పారు. వచ్చే 34 ఏళ్లలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందన్నారు.

**బిజినెస్ ఫ్రెండ్లీ స్టేట్ ఆంధ్రప్రదేశ్..**

'దశాబ్దాలుగా దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరవుతున్నాని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. దావోసుకు వచ్చిన ప్రతిసారీ పారిశ్రామికవేత్తలు, నిపుణుల నుంచి కొత్త విషయాలు తెలుసుకుంటానన్నారు. టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో వస్తున్న మార్పులను తెలుసుకుని పాలసీలు రూపొందిస్తానన్నారు. దావోస్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల ఆలోచనలు అర్థం చేసుకుని రాష్ట్రాన్ని బిజినెస్ ఫ్రెండ్లీ స్టేట్‌గా మారుస్తున్నామన్నారు. నాలెడ్జ్ ఎకానమీ దేశ ఆర్థిక వ్యవస్థనే మారుస్తుందని చెప్పారు. భారతీయులు... అందులోనూ తెలుగు ప్రజలు టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో ముందుంటారన్నారు. టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటేనే అద్భుత ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మరే దేశంలో లేని యువశక్తి భారత్‌లో ఉందన్నారు. దేశానికి నేడు తిరుగులేని సమర్థ నాయకత్వం ఉందన్నారు. గతంలో పారిశ్రామికవేత్తలను ఏపీకి తీసుకురావాలంటే చాలా కష్టపడాల్సి వచ్చేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. తెలుగు ప్రజల విజయాలు, ఏపీ బ్రాండ్ సానుకూల అంశంగా మారాయన్నారు. ప్రతీ రంగంలో నిర్దిష్ట లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 'కలిసి ఎదుగుదాం... కలిసి పయనిద్దాం... భవిష్యత్‌ని కలిసి నిర్మిద్దాం...' అని ముఖ్యమంత్రి అన్నారు. బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, మాస్టర్ కార్డ్ సీఏఓ, కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ సహా విదేశీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. సెషన్‌కి హాజరైన జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల దగ్గరకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మీయంగా పలకరించారు.

వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి రోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థికపర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ - యూఏఈ మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంతో కలిసి యూఏఈ దుబాయ్ ఫుడ్ క్లస్టర్ పని చేసేందుకు అల్ మార్రీ అంగీకారం తెలిపారు. అలాగే యూఈఏకి చెందిన సుమారు 40 సంస్థలు ఏపీలో ఏర్పాటు చేసేలా తోడ్పాటు అందిస్తామన్నారు. మరోవైపు ఆహార భద్రత, లాజిస్టిక్స్, పోర్ట్ ఆధారిత పరిశ్రమలు, పునరుత్పాదక శక్తి, పట్టణాభివృద్ధి, పర్యాటకం, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను అల్ మార్రీకి ముఖ్యమంత్రి వివరించారు. యూఏఈకి చెందిన షరాఫ్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై చర్చ జరిగింది. లైట్ గేజ్ స్టీల్ ఫ్రేమింగ్ సాంకేతికతతో అమరావతిలో ఆధునిక నిర్మాణ యూనిట్ ఏర్పాటు డీపీ వరల్డ్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద స్థాయి పోర్ట్ టెర్మినల్స్, లాజిస్టిక్స్ మౌలిక వసతుల అభివృద్ధి, ఏడీఎన్ఓసీ సంస్థ ద్వారా ఫ్లోటింగ్ స్టోరేజ్, రీగ్యాసిఫికేషన్ యూనిట్ ఏర్పాటు... విశాఖలో లూలూ గ్రూప్ మెగా షాపింగ్ మాల్ నిర్మాణంపైనా చర్చించారు. యూఏఈతో వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా ఏపీలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ఎగుమతులు మరింత వేగంగా పెరుగుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సినిమా రంగానికి పెద్దపీట ..

**ముద్ర, హైదరాబాద్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సినిమా రంగానికి పెద్దపేట వేస్తున్నామని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటి వరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా.సి. నారాయణరెడ్డి అవార్డులను అందజేయనున్నా మని పేర్కొన్నారు.

అర్హులైన నిర్మాతలు మరియు ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను ఈ నెల 31, వరకు పొందవచ్చన్నారు. ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువు లోపే దరఖాస్తులను సమర్పించాలని, అర్హులైన నిర్మాతలను ప్రభుత్వం తరుపున మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కోరారు.

# హోం సెక్రెటరీపై కోర్టు ధిక్కరణ కేసు

- సినిమా టికెట్ల ధరల పెంపుపై ఆగ్రహం

**ముద్ర, హైదరాబాద్:**

సినిమా విడుదలకు 90 రోజుల ముందే టికెట్ ధరల పెంపు ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. మన శంకర వర ప్రసాద్ సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదుకు ఆదేశాలు జారీ చేసింది. మన శంకర వర ప్రసాద్ సినిమా టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో లాయర్ విజయ్ గోపాల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిగి హోంశాఖ ప్రధాన కార్యదర్శికి నోటీసులు ఇచ్చి, ఇకపై టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను 90 రోజుల ముందే ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.

# భార్యాభర్తల గొడవలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- కోర్టుల్ని యుద్ధభూములుగా చేసుకోవద్దని హితవు

**ముద్ర, హైదరాబాద్:**



వైవాహిక జీవితంలో గొడవలు పడే దంపతులు కోర్టులను యుద్ధభూములుగా చేసుకుని సాగించే వ్యక్తిగత కక్ష సాధింపులను అనుమతించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయస్థానంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు ఈ కేసులను మరింత జటిలం చేస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో త్వరితగతిన పరిష్కారం కోసం మధ్యవర్తిత్వ మార్గాన్ని అనుసరించాలని సూచించింది. ఈ విధానం ద్వారా చాలా కేసుల్లో సానుకూల ఫలితాలు వస్తున్నట్లు తెలిపింది. పెళ్లి చేసుకుని కేవలం 65 రోజులే కలిసి ఉండి, పదేళ్లుగా దూరంగా ఉంటున్న ఓ జంటకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. ఈ వివాహ బంధం కోలుకోలేని విధంగా విచ్ఛిన్నమైందని పేర్కొంటూ.. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి విడాకులు మంజూరు చేసింది. వైవాహిక వివాదాల్లో ఇరుపక్షాలు.. అవతలి పక్షానికి ఎలా బుద్ధి చెప్పాలా? అనే దానిపై దృష్టి పెడుతున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. కొన్నిసార్లు కృత్రిమ మేధ వంటి సాంకేతికతలను ఉపయోగించి ఆధారాలను సృష్టిస్తున్నట్లు తెలిపింది. తప్పుడు ఆరోపణలు పెరుగుతున్నట్లు చెప్పింది. ఇటువంటి వివాదాలు సమాజంపై ప్రభావం చూపుతాయని, ఈ నేపథ్యంలో కేసులు దాఖలు చేయడానికి ముందే వాటిని పరిష్కరించేందుకు కుటుంబ సభ్యులు తదితరులు ప్రయత్నించాలని సూచించింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



# విరాట్.. టేక్ ఏ బౌ మ్యాన్!

ముద్ర, న్యూ ఢిల్లీ

కొన్ని చెప్పుకోవాలి. కొందరి గురించి కచ్చితంగా చెప్పుకోవాలి. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని మరి కొంతమంది వస్తారు. యావత్ క్రికెట్ రంగాన్ని సమూలంగా మార్చేస్తారు. ఆధునిక క్రికెట్ లో శరీర సామర్థ్యాన్ని సక్రమంగా నిర్వహించే ప్లేయర్లు కొంతమంది మాత్రమే. అందులో కచ్చితంగా విరాట్ కోహ్లీకి ఫస్ట్ ప్లేస్ ఉంటుంది. ఇందులో అనుమానమే లేదు. అతిశయోక్తి అంతకన్నా లేదు.

న్యూజిలాండ్ జట్టుతో జరిగిన వన్డే సిరీస్ ను గమనిస్తే.. విరాట్ కోహ్లీ ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ చేశాడు. ఇండియా తరఫున హైయెస్ట్ రన్స్ కొట్టిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. వాస్తవానికి విరాట్ కోహ్లీ 2008 నుంచి క్రికెట్ ఆడుతూనే ఉన్నాడు. ఇన్ని సంవత్సరాల నుంచి క్రికెట్ ఆడుతున్నప్పటికీ.. అతడికి అలుపు అనేది లేదు. పైగా బెబ్బులి మాదిరిగా ప్రత్యర్థి బౌలర్ల మీద విరుచుకుపడుతుంటాడు. ఏమాత్రం భయం అనేది లేకుండా బ్యాటింగ్ చేస్తుంటాడు. ఫీల్డింగ్ విషయంలో అతడికి అతడే సాటి. ముందుగా బ్యాటింగ్ చేయడాని కంటే.. చేజింగ్ లోనే అతడు ఎక్కువ సత్తాను చూపిస్తాడు.

టెస్ట్, టీ 20 ల నుంచి తప్పుకుండా తర్వాత విరాట్ కోహ్లీ పరిమితం ఓవర్ల క్రికెట్ మాత్రమే ఆడుతున్నాడు. వాస్తవానికి కెరియర్ చివరి దశలో ఉన్న విరాట్ కోహ్లీ.. తన పూర్వపు ఫామ్ కొనసాగిస్తున్నాడు. వేదికతో సంబంధం లేకుండా.. ప్రత్యర్థి జట్టుతో సంబంధం లేకుండా పరుగులు తీస్తున్నాడు. ఇండోర్ వేదికగా జరిగిన మూడో వన్డేలో విరాట్ కోహ్లీ న్యూజిలాండ్ ఇన్నింగ్స్ లో 50 ఓవర్ల పాటు ఫీల్డింగ్ చేశాడు. పైగా అత్యంత కీలకమైన స్థానాలలో అతడు బంతిని నిలుపుదల చేశాడు. నాలుగో ఓవర్లో బ్యాటింగ్ కు వచ్చాడు. 46 ఓవర్ వరకు బ్యాటింగ్ చేశాడు. 108 బంతుల్లో 124 పరుగులు చేశాడు. దీనిని బట్టి విరాట్ కోహ్లీ సామర్థ్యం ఏమిటో అర్థం చేసుకోవచ్చు.




క్రికెటర్లు చాలామంది తమ సామర్థ్యాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు విజయవంతం అయితే.. మరికొందరు విఫలమవుతుంటారు. దీర్ఘ కాలం మాత్రం తమ శరీర సామర్థ్యాన్ని కొనసాగించలేరు. కానీ ఈ విషయంలో విరాట్ కోహ్లీ అందరికంటే పూర్తి డిఫరెంట్. అతడు తినే తిండి, తాగే నీరు.. ప్రతిదీ ప్రత్యేకమే. అందువల్లే అతడిని ఫిట్నెస్ ఫ్రీక్ అని పిలుస్తుంటారు.




# రోహిత్, విరాట్ కోహ్లీకి బిగ్ షాక్ ఇచ్చిన బిసిసిఐ!

- **ప్రస్తుతం ఏ ప్లస్ కేటగిరి లో విరాట్ , రోహిత్**
- **వన్డేలకే దిగ్గజ ఆటగాళ్లు పరిమితం..**
- **బీ కేటగిరీలోకి మార్చేందుకు యోచన**

ముద్ర, న్యూ ఢిల్లీ

సుదీర్ఘకాలంగా టీం ఇండియాలో ఆడుతున్నప్పటికీ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. పైగా వారు వైట్ బాల్ ఫార్మేట్ లోనే ఆడుతున్నారు. టి20, టెస్ట్ క్రికెట్ కు గుడ్ బై చెప్పేశారు. వన్డే ఫార్మేట్లో ఆడుతున్న వారిద్దరు సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. ఇటీవల జరిగిన న్యూజిలాండ్ సిరీస్లో విరాట్ కోహ్లీ పరుగుల మోత మోగించాడు. రోహిత్ అంచనాలను అందుకోలేకపోయినప్పటికీ... అతడి మీద మేనేజ్మెంట్ కు గట్టి నమ్మకం ఉంది.

వీరిద్దరూ వచ్చే వరల్డ్ కప్ లో ప్రాతినిధ్యం వహించేందుకు తాపత్రయపడుతున్నారు. ఇందులో భాగంగానే వన్డే క్రికెట్ ఆడుతున్నారు. తమ సామర్థ్యాన్ని మరింతగా మెరుగుపరుచుకుంటున్నారు. రోహిత్ శర్మ అయితే ఏకంగా తన బరువును పూర్తిగా తగ్గించుకున్నాడు. పూర్తి స్లిమ్ గా కనిపిస్తూ అదరగొడుతున్నాడు. అయితే విరాట్, రోహిత్ శర్మకు భారత క్రికెట్ నియంత్రణ మండలి షాక్ ఇచ్చింది. ఆటగాళ్ల వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ విధానంలో మార్పులు తీసుకురావాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ ప్రకారం ఏ ప్లస్ కేటగిరీని తొలగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇకపై ఏ, బీ, సీ కేటగిరిలు మాత్రమే ఉంటాయని బిసిసిఐ వర్గాలు చెప్పినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీనిపై తదుపరి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్లో బీసీసీఐ నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది.

ప్రస్తుతం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఏ ప్లస్ కేటగిరిలో ఉన్నారు. మీరు బి కేటగిరిలో కి వెళ్తారు. ఎందుకంటే వీరిద్దరూ వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. ఇక ప్రస్తుతం ఉన్న కేటగిరీల ప్రకారం చూసుకుంటే ఏ ప్లస్ కేటగిరి లో ఉన్న ఆటగాళ్లకు ఏడు కోట్లు, ఏ, బీ, సీ కేటగిరిలో ఉన్న ప్లేయర్లకు వరుసగా ఐదు కోట్లు, మూడు కోట్లు, కోటి రూపాయలు సంవత్సరానికి ఇస్తున్నారు. బీసీసీఐ ఏ ప్లస్ కేటగిరి ఎత్తేస్తే.. వార్షిక ఫీజులో మార్పు వస్తుందని తెలుస్తోంది.

బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక బలమైన కారణం ఉంది. ఏ ప్లస్ కేటగిరీలో కొంతమంది ప్లేయర్లు మాత్రమే ఉన్నారు. అయితే జట్టులో ఏకీకృత విధానాన్ని తీసుకురావాలని మేనేజ్మెంట్ భావిస్తున్న నేపథ్యంలో.. ఏ ప్లస్ కేటగిరిని ఎత్తివేస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు వర్ధమాన క్రీడాకారులను బి లేదా సీ కేటగిరిలోకి తీసుకురావాలని బీసీసీఐ పెద్దలు భావిస్తున్నారు. ప్లేయర్ల కేటగిరిలు.. వారికి సంబంధించిన ఫీజు విషయాలు త్వరలోనే ఆఫీస్ కౌన్సిల్ మీటింగ్లో తేలుతాయని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ విరాట్ కోహ్లీ, రోహిత్ కేటగిరీలను మార్చడం పట్ల అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి దీనిపై బిసిసిఐ పెద్దలు ఎలాంటి సమాధానం చెప్తారో చూడాల్సి ఉంది.

# ఆటకు గుడ్ బై చెప్పిన సైనా నెహ్వాల్.. భారత బ్యాడ్మింటన్‌లో ముగిసిన ఒక శకం

- **ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్‌కు వీడ్కోలు పలికిన సైనా నెహ్వాల్**
- **తీవ్రమైన మోకాలి గాయం కారణంగానే ఈ నిర్ణయం**
- **సైనా కెరీర్‌ను కొనియాడుతూ యువరాజ్ సింగ్ ట్వీట్**
- **ఆమె విజయాలు లక్షలాది మందికి స్ఫూర్తి అని ప్రశంస**
- **హైదరాబాద్ రాకతోనే ఆమె కెరీర్ మలుపు తిరిగిందని వెల్లడి**



ముద్ర, న్యూ ఢిల్లీ

భారత బ్యాడ్మింటన్ రూపురేఖలను మార్చేసిన దిగ్గజ క్రీడాకారిణి, ఒలింపిక్ పతక విజేత సైనా నెహ్వాల్ తన అద్భుతమైన కెరీర్‌కు ముగింపు పలికింది. గత రెండేళ్లుగా తీవ్రమైన మోకాలి నొప్పితో ఆటకు దూరంగా ఉన్న ఆమె, తన శరీరం ఇక ఉన్నత స్థాయి పోటీలకు సహకరించడం లేదని, ప్రొఫెషనల్‌గా ఆడలేనని స్పష్టం చేసింది. అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించకపోయినప్పటికీ, తాజాగా ఒక పాడ్‌కాస్ట్‌లో ఆమె చేసిన వ్యాఖ్యలతో తన ప్రస్థానం ముగిసినట్లు తేలిపోయింది. రిటైర్మెంట్ గురించి ప్రత్యేకంగా ప్రకటించాల్సిన అవసరం లేదనుకుంటున్నానని సైనా పేర్కొంది.ఈ సందర్భంగా భారత క్రికెట్ లెజెండ్ యువరాజ్ సింగ్, సైనాకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆమె కెరీర్‌ను ప్రశంసించాడు. "అద్భుతమైన కెరీర్‌కు అభినందనలు సైనా! నువ్వు భారత బ్యాడ్మింటన్‌ను ముందుకు నడిపి, ఒక తరానికి స్ఫూర్తిగా నిలిచావు. నీ భవిష్యత్తుకు ఆల్ ది బెస్ట్" అని ఎక్స్ లో పోస్ట్ చేశాడు.

**గాయాలతో పోరాటం..**

మోకాలిలోని కార్టిలేజ్ పూర్తిగా దెబ్బతినడం, ఆర్థరైటిస్ సమస్యల వల్లే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సైనా వివరించింది. "ప్రపంచంలో అత్యుత్తమంగా రాణించాలంటే రోజుకు 8 నుంచి 9 గంటలు శిక్షణ తీసుకోవాలి. కానీ ఇప్పుడు గంట, రెండు గంటలకే నా మోకాలు వాచిపోయి, నొప్పి మొదలవుతోంది. ఆ తర్వాత ఆడటం చాలా కష్టంగా మారింది. ఇక నా శరీరాన్ని ఇంతకంటే కష్టపెట్టలేననిపించింది. అందుకే చాలనుకున్నాను" అని ఆమె భావోద్వేగంతో తెలిపింది.

**హైదరాబాద్‌కు రాకతో మారిన జీవితం**

హర్యానాలోని హిస్సార్‌లో 1990 మార్చి 17న జన్మించిన సైనా నెహ్వాల్ జీవితం, ఆమె తండ్రి డాక్టర్ హర్వీర్ సింగ్ హైదరాబాద్‌కు బదిలీ కావడంతో కీలక మలుపు తిరిగింది. వ్యవసాయ శాస్త్రవేత్త అయిన ఆయన ఉద్యోగ రీత్యా 1998లో హైదరాబాద్‌కు మారారు. ఇక్కడ స్థానిక భాష రాకపోవడంతో ఒంటరిగా భావించిన సైనా, తన తల్లి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో బ్యాడ్మింటన్ ఆడటం ప్రారంభించింది. ఆమె ప్రతిభను గుర్తించిన తండ్రి, లాల్ బహదూర్ స్టేడియంలో కోచింగ్‌కు పంపించారు. కూతురి శిక్షణ కోసం తన పీఎఫ్ డబ్బును ఖర్చు చేయడమే కాకుండా, ప్రమోషన్లను కూడా వదులుకుని ఆయన చేసిన త్యాగం, సైనాను ప్రపంచ స్థాయి క్రీడాకారిణిగా తీర్చిదిద్దింది.

**అసాధారణ విజయాలు**

2008లో బీజింగ్ ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన తొలి భారత మహిళగా, అదే ఏడాది వరల్డ్ జూనియర్ చాంపియన్‌గా సైనా చరిత్ర సృష్టించింది. 2009లో ఇండోనేషియా ఓపెన్ గెలిచి, BWF సూపర్ సిరీస్ టైటిల్ సాధించిన తొలి భారతీయురాలిగా నిలిచింది. 2010లో ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధించింది.ఆమె కెరీర్‌లో అత్యంత ముఖ్యమైన ఘట్టం 2012 లండన్ ఒలింపిక్స్. ఈ పోటీల్లో కాంస్య పతకం గెలిచి, బ్యాడ్మింటన్‌లో ఒలింపిక్ పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. 2015లో వరల్డ్ నంబర్ 1 ర్యాంకును అందుకుని, ప్రకాశ్ పదుకొణే తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయురాలిగా చరిత్రకెక్కింది. సైనా తన కెరీర్‌లో మొత్తం 24 అంతర్జాతీయ టైటిల్స్ గెలుచుకుంది. బ్యాడ్మింటన్ రంగంలో ఆమె ఘనతలకు గానూ ప్రభుత్వం అర్జున అవార్డు (2009), రాజీవ్ గాంధీ ఖేల్ రత్న (2010), పద్మశ్రీ (2010), పద్మభూషణ్ (2016) పురస్కారాలతో సత్కరించింది.ప్రత్యేకంగా రిటైర్మెంట్ ప్రకటన చేయకపోయినా, సైనా మాటలతో భారత బ్యాడ్మింటన్‌లో ఒక స్వర్ణయుగం ముగిసినట్లయింది. ఆమె పోరాట పటిమ, విజయాలు లక్షలాది మంది యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయి.



# సంజయ్ మంజ్రేకర్ పై మరోసారి ఫైర్ అయిన విరాట్ కోహ్లీ సోదరుడు

ముద్ర, న్యూ ఢిల్లీ

మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్‌పై విరాట్ కోహ్లీ సోదరుడు వికాస్ కోహ్లీ మరోసారి ఘాటుగా స్పందించారు. విరాట్ కోహ్లీపై మంజ్రేకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా సోషల్ మీడియా వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చెప్పడం ఎవరికైనా సులువేనని, కానీ చేయడమే అసలైన సవాలని వికాస్ వ్యాఖ్యానించారు.

విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి టాప్ ఆర్డర్ బ్యాటర్‌కు సులువైన వన్డే ఫార్మాట్‌ను ఎంచుకున్నాడంటూ ఇటీవల సంజయ్ మంజ్రేకర్ విమర్శలు చేశారు. ఫ్యాబ్ 4లోని జో రూట్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్ తమ లోపాలను సరిదిద్దుకుని టెస్టుల్లో మెరుగ్గా రాణిస్తున్నారని, అలాంటి సమయంలో కోహ్లీ టెస్టులకు గుడ్‌బై చెప్పడం తనకు బాధ కలిగించిందని మంజ్రేకర్ వ్యాఖ్యానించారు. అంతేకాదు, కోహ్లీ అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్మెంట్ తీసుకున్నా బాగుండేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.ఈ నేపథ్యంలో ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో విరాట్ కోహ్లీ అద్భుత సెంచరీ చేయడంతో వికాస్ స్పందించారు. తన 'థ్రెడ్స్' ఖాతాలో పోస్టు చేస్తూ, ''క్రికెట్‌లో ఏది సులువైన ఫార్మాటో మిస్టర్ ఎక్స్‌పర్ట్ చెప్పగలరా? అలా చెప్పాలంటే మీరు అక్కడ ఉండాలి. ఏదైనా సరే... చెప్పడం సులువు, చేయడమే కష్టం'' అంటూ మంజ్రేకర్‌ను పరోక్షంగా టార్గెట్ చేశారు.

# పాకిస్తాన్ తోకముడిచింది..

- **టీ20 ప్రపంచ కప్ బహిష్కరించమని పాకిస్తాన్ క్రికెట్ అసోసియేషన్ ప్రకటన..**

ముద్ర, న్యూ ఢిల్లీ

భారత్‌లో 2026 టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడబోమని బంగ్లాదేశ్ బెట్టు చేస్తోన్న సంగతి తెలిసిందే. భద్రత కారణాలు, జాతీయ గౌరవాన్ని సాకుగా చూపుతూ కోల్‌కతా, ముంబయిలలో జరగాల్సిన తమ మ్యాచ్‌ల కోసం భారత్‌కు వచ్చేందుకు నిరాకరిస్తోంది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా పాకిస్థాన్ కూడా ప్రపంచ కప్ మ్యాచ్‌లను బహిష్కరించాలని యోచిస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వార్తలపై పాకిస్థాన్ తాజాగా స్పందించింది. అవన్నీ ఊహాగానాలేనని స్పష్టం చేసింది. భద్రతా కారణాలతో బంగ్లాదేశ్ మ్యాచ్‌లు ఆడొద్దని నిర్ణయించుకున్నా తాము టోర్నమెంట్‌ను బహిష్కరించబోమని వెల్లడించింది. '2025 ఆరంభంలో జరిగిన ఒప్పందం ప్రకారం మా మ్యాచ్‌లన్నీ శ్రీలంకలో షెడ్యూల్ చేశారు. మేం టోర్నీ నుంచి ఎందుకు వైదొలగాలి? వివాదాన్ని మరింత పెద్దది చేయడానికి కొందరు ఇలాంటి విషయాలను తెరపైకి తెస్తున్నారు' అని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వర్గాలు ఓ క్రీడా వెబ్‌సైట్‌కు వెల్లడించాయి.

**ఐసీసీ ఒత్తిడికి తలొగ్గం: బీసీబీ**

భారత్‌లో పర్యటించేందుకు బంగ్లా నిరాకరిస్తే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ భావిస్తున్నట్లు వార్తలొచ్చాయి. కానీ, ఈ విషయం గురించి ఐసీసీ తమకు అధికారిక సమాచారం అందించలేదని బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ అన్నారు. 'ఒత్తిడి చేసి మమ్మల్ని భారత్‌లో మ్యాచ్‌లు ఆడించలేరు. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడిస్తామని ఐసీసీ మాకు అధికారికంగా సమాచారం ఇవ్వలేదు.' అని నజ్రుల్ వివరించారు. మరోవైపు, ఐసీసీ తమతో ఇప్పటివరకు ఎలాంటి సంప్రదింపులు జరపలేదని స్కాట్లాండ్ పేర్కొంది.




# గౌతమ్ గంభీర్ అవుట్... టీమిండియా కొత్త కోచ్ ?

ముద్ర, న్యూ ఢిల్లీ

టీమ్ ఇండియాకు ఏం ముహూర్తాన కోచ్ గా వచ్చాడో తెలియదు గాని.. గౌతమ్ గంభీర్ విపరీతమైన విమర్శలు ఎదుర్కొంటున్నాడు. వరుస ఓటములు.. ముఖ్యంగా టెస్ట్ ఫార్మేట్ లో దారుణమైన పరాభవాలు గౌతమ్ గంభీర్ ను తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నాయి. పైగా జట్టు అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా ఇష్టానుసారంగా మార్పులు, చేర్పులు చేస్తున్న నేపథ్యంలో అవి టీమిండియా విజయాలపై తీవ్రంగా ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

ఇటీవల న్యూజిలాండ్ సిరీస్ లో కూడా ఫామ్ లో లేని రవీంద్ర జడేజాను తీసుకుని గౌతమ్ గంభీర్ విమర్శల పాలయ్యాడు. అక్షర్ పటేల్ ను దూరం పెట్టడంతో టీమిండియా మిడిల్ ఓవర్లలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. దీనికి తోడు గిల్ ను జట్టు మీద అనవసరంగా రుద్దుతూ.. యశస్వి జైస్వాల్ వంటి ప్లేయర్ ను దూరం పెట్టడం కూడా గౌతమ్ గంభీర్ ను విమర్శల పాలు చేస్తోంది. గౌతమ్ గంభీర్ పనికిమాలిన నిర్ణయాల వల్లే టీమిండియా ఇలా ఇబ్బంది పడాల్సి వస్తోందని.. చివరికి స్వదేశంలో కూడా ఓడిపోవలసి వస్తోందని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గౌతమ్ గంభీర్ ఏకపక్ష నిర్ణయాల వల్ల టీమిండియా ఇబ్బంది పడుతోందని.. అతడు కోచ్ పదవికి ఏమాత్రం అర్హుడు కాదంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కొంతమంది అభిమానులైతే టీమిండియా కోచ్ పదవి నుంచి గౌతమ్ గంభీర్ ను తొలగించాలని.. ఆస్థానంలో యువరాజ్ సింగ్ కు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. యువరాజ్ శిక్షణలో అభిషేక్ శర్మ, గిల్ ఎంతటి నైపుణ్యం సాధించారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని.. గౌతమ్ గంభీర్ శిక్షణ ఇచ్చిన హర్షిత్ ఎలా ఆడుతున్నాడో అందరికీ తెలుసని అభిమానులు గుర్తు చేస్తున్నారు.



గౌతమ్ గంభీర్ ను కోచ్ పదవి నుంచి తొలగించాలని వ్యక్తం అవుతున్న డిమాండ్ ఈనాటిది కాదు. గతంలోనే అతడి స్థానంలో వివిఎస్ లక్ష్మణ్ ను తీసుకోవాలని సోషల్ మీడియాలో ఒక ఉద్యమం నడిచింది. దానిపై వివిఎస్ లక్ష్మణ్ స్పందించలేదు. కాగా, వివిఎస్ లక్ష్మణ్ ప్రస్తుతం బీసీసీఐలో కీలకమైన పదవిలో ఉన్నారు. అప్పట్లో జాతీయ మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం తదుపరి కోచ్ వివిఎస్ లక్ష్మణ్ అని తేలింది. అయితే దీనిపై ఇంతవరకు బీసీసీఐ అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## 2027 సంక్రాంతికి కర్చీఫ్ వేసుకున్న చిరంజీవి...



మరో హిట్టు కోసం ప్రయత్నం
సినిమా ఇండస్ట్రీలో రాణించాలి అంటే వారసత్వం ఉండాలి అనే ఒక ధోరణికి స్వస్తి చెబుతూ స్వయంకృషి ఉంటే ఎవరైనా సరే ఇండస్ట్రీలో రాణించొచ్చు అని ప్రూవ్ చేసిన ఒకే ఒక హీరో మెగాస్టార్ చిరంజీవి...వరుస సినిమాలు చేస్తూ ఇండస్ట్రీ లో తనకంటూ ఒక ఐడెంటిటిని క్రియేట్ చేసుకున్నాడు. చిరంజీవి తన డాన్సులతో, ఫైట్లతో ప్రేక్షకులందరిని మైమరిపింపజేశాడు. నిత్య కృషివలుడిగా పేరు తెచ్చుకొని ఒక సినిమా కోసం ఎంత ఎఫర్ట్స్ అయితే కావాలో అంత ఎఫర్ట్స్ పెట్టి ఆ సినిమాని సక్సెస్ ఫుల్ గా మార్చడానికి తీవ్రమైన కృషి చేస్తుంటాడు. మెగాస్టార్ చిరంజీవి నుంచి వచ్చిన ప్రతి సినిమా అతనికి గొప్ప ఇమేజ్ ని తీసుకొచ్చి పెట్టింది. రీసెంట్ గా సంక్రాంతి కానుకగా వచ్చిన 'మన శంకర వరప్రసాద్' సినిమాతో సైతం మరోసారి సూపర్ సక్సెస్ ని సాధించాడు. వారం రోజుల్లోనే ఈ సినిమా 300 కోట్లకు పైన కలెక్షన్స్ ని రాబట్టడం అనేది నిజంగా చాలా గొప్ప విషయమనే చెప్పాలి. మెగాస్టార్ చిరంజీవి ఇప్పటివరకు ఈ రేంజ్ కలెక్షన్స్ అయితే రాబట్టలేదు. వాల్తేరు వీరయ్య సినిమాతో 200 కోట్ల క్లబ్లో చేరిన ఆయన మన శంకర వరప్రసాద్ సినిమాతో 300 కోట్లకు పైన కలెక్షన్స్ ని కొల్లగొడుతూ ముందుకు దూసుకెళ్తుండటం విశేషం...ఇక లాంగ్ రన్ లో ఈ సినిమా 450 కోట్ల వరకు కలెక్షన్స్ ను కొల్లగొడుతుందనే అంచనాలో మేకర్స్ ఉన్నారు... చిరంజీవికి సంక్రాంతి పండుగ సీజన్ చాలా కలిసి వస్తుంది.
ఇంతకు ముందు వరకు చాలా సినిమాలతో సూపర్ సక్సెస్ లను సాధించిన ఆయన ఇప్పుడు మరోసారి మన శంకర్ వరప్రసాద్ సినిమాతో సంక్రాంతి హీరోగా నిలిచాడు. ఈ సంక్రాంతి ముగిసిందో లేదో నెక్స్ట్ సంక్రాంతికి సైతం తన సినిమాను ప్రేక్షకుల ముందుకు తేవడానికి చిరంజీవి సిద్ధమవుతున్నాడు. 2027వ సంవత్సరంలో సినిమాను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. ఫిబ్రవరి నెల నుంచి సినిమా రెగ్యూలర్ షూటింగ్ అయితే జరపబోతున్నారట. మొత్తానికైతే 10 నెలల్లో సినిమా షూటింగ్ కంప్లీట్ చేసి సంక్రాంతి కానుకగా మరోసారి ఆ సినిమాని 2027 సంక్రాంతి బరిలో నిలిపే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే చిరంజీవి బాబీ కాంబినేషన్లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' సినిమా 2023వ సంవత్సరం సంక్రాంతి కానుకగా వచ్చి సూపర్ సక్సెస్ ను సాధించింది...ఇక మరోసారి వీళ్ళ కాంబినేషన్ వర్కౌట్ అవుతుందా? లేదా అనేది తెలియాల్సి ఉంది...

## మహేష్ బాబు కొడుకు టాలీవుడ్ ఎంట్రీ

- **ఆ డైరెక్టర్ దగ్గర జాయిన్ చేయిస్తున్నాడా..?**

సినిమా ఇండస్ట్రీలో వారసుల హవా ఎక్కువైపోతుంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఉన్న నాలుగైదు కుటుంబాల నుంచి స్టార్ హీరోలు సినిమా ఇండస్ట్రీని ఏలుతున్న విషయం మనకు తెలిసిందే. ఇక ఆ ఫ్యామిలీ నుంచి నెక్స్ట్ జనరేషన్ నటులు సైతం ఇండస్ట్రీకి రావడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కొంతమంది యాక్టింగ్ లో శిక్షణను ఇప్పిస్తుంటే మరి కొంత మంది మాత్రం దర్శకత్వ విభాగంలో కూడా వాళ్లకు కొన్ని టెక్నిక్స్ తెలిసి ఉంటే బాగుంటుంది. అలాగే వాళ్లకు యాక్టింగ్ చేయడం ఈజీ అవుతుంది. అందుకే దర్శకుల దగ్గర తమ కొడుకులను జాయిన్ చేస్తున్నారు. ఇప్పటికే రవితేజ లాంటి నటుడు తన కొడుకును సందీప్ రెడ్డి వంగ దగ్గర స్పిరిట్ సినిమా కోసం అసిస్టెంట్ డైరెక్టర్ గా జైన్ చేయించాడు. దానివల్ల సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన మెలకువలు నేర్చుకోవడమే కాకుండా ప్రతి క్రాఫ్ట్ లో దగ్గరుండి మరి వర్క్ నేర్చుకుంటే బాగుంటుందనే ఉద్దేశ్యంతోనే రవితేజ ఇలాంటి పని చేసినట్టుగా తెలుస్తుంది.
ఇక ఇప్పుడు మహేష్ బాబు సైతం తన కొడుకుని సందీప్ రెడ్డి వంగ దగ్గరికి పంపించాలనే ప్రయత్నంలో ఉన్నాడు. ప్రస్తుతం యాక్టింగ్ శిక్షణ తీసుకుంటున్న గౌతమ్ స్పిరిట్ తర్వాత సందీప్ రెడ్డి వంగ చేయబోయే సినిమాకి తన దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్ గా జాయిన్ అవ్వబోతున్నారట.
ఒక్క సినిమాకి తన దగ్గర డైరెక్షన్ డిపార్ట్మెంట్లో వర్క్ చేస్తే అన్ని క్రాఫ్ట్ ల మీద అవగాహన వస్తుందనే ఉద్దేశ్యంతోనే మహేష్ బాబు అలాంటి పని చేయిస్తున్నాడట. మొత్తానికైతే గౌతమ్ హీరో గానే ఇండస్ట్రీలో రాణించాలనే ప్రయత్నం చేస్తున్నాడు. కాబట్టి దర్శకత్వానికి సంబంధించిన కొన్ని విషయాలు తెలిసి ఉండడం వల్ల ఆర్టిస్టుగా దర్శకులకు ఎలాంటి ఇబ్బందులు ఉంటాయి అనే విషయాన్ని కూడా తను తెలుసుకున్నవాడవుతాడు.



ఇక ఏది ఏమైనా కూడా సందీప్ రెడ్డి వంగ స్టైల్ డిఫరెంట్ గా ఉంటుంది. కాబట్టి అతని దగ్గర వర్క్ నేర్చుకుంటేనే పూర్తిస్థాయి వర్క్ తెలుస్తుంది అనే ఉద్దేశంతో సినిమా హీరోలు, దర్శకులు సైతం వాళ్ళ పిల్లల్ని తన దగ్గరికి పంపిస్తున్నారు... ఇక గౌతమ్ హీరోగా సినిమా ఇండస్ట్రీకి ఎప్పుడు ఎంట్రీ ఇస్తాడు అనే దాని కోసమే ఘట్టమనేని అభిమానులందరు ఎదురు చూస్తున్నారు...

## మహేష్ బాబు తో అంత ఈజీ కాదు



సినిమా ఇండస్ట్రీ లో స్టార్ హీరోల సినిమాకి ఎక్కువ డిమాండ్ ఉంటుంది. వాళ్ళు చేస్తున్న ప్రతి సినిమాలో ఏదొక వైవిధ్యమైన కథాంశం ఉండే విధంగా చూసుకుంటున్నారు. అందుకే వాళ్ల నుంచి వచ్చే సినిమాలు సగటు ప్రేక్షకులందరిని మెప్పిస్తున్నాయి. యావత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీ మొత్తంలో సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ నెక్స్ట్ లెవెల్ అనే చెప్పాలి. అలాంటి మహేష్ బాబు ఈ మధ్య కాలంలో చేస్తున్న సినిమాలు అతనికి పెద్దగా సక్సెస్ లను తీసుకొచ్చి పెట్టలేదు. దాంతో రాజమౌళి డైరెక్షన్లో 'వారణాసి' అనే సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాతో ఎలాగైనా సరే పాన్ వరల్డ్ లోకి ఎంట్రీ ఇచ్చి అక్కడ తన సత్తా చాటుకోవాలనే ప్రయత్నం చేస్తున్నాడు. అందుకోసమే ఇప్పటివరకు మహేష్ బాబు ఏ సినిమాకి కష్టపడినంత రేంజ్ లో ఈ సినిమాలో విపరీతంగా కష్టపడుతూ తన అభిమానులను ఎలాగైనా సరే సాటిపై చేయాలనే ప్రయత్నం చేస్తున్నాడు. ఇక ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన గ్లింప్స్ చూస్తే ఈ సినిమా ఎలాంటి బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతుందో మనకు క్లారిటీ అయితే వచ్చింది. ఇక ఈ సినిమాలో మహేష్ బాబు ఐదు పాత్రల్లో నటిస్తుండటం విశేషం...గతంలో మహేష్ బాబుతో సినిమాలను చేసిన దర్శకులందరు మహేష్ బాబుతో సినిమా చేయడం అంత ఈజీ కాదు. ఆయన రేంజ్ కథ దొరికినప్పుడు మాత్రమే ఆయనతో సినిమాలు చేయాలి అంటూ కామెంట్లైతే చేశారు. మహేష్ బాబుతో యువరాజు అనే సినిమా చేసిన వైవిఎస్ చౌదరి అలాగే మహేష్ బాబుకి ఒక్కడు లాంటి సూపర్ సక్సెస్ ని అందించిన గుణశేఖర్ సైతం అలాంటి కామెంట్లు చేయడం విశేషం...గుణశేఖర్ తో మహేష్ బాబు మూడు సినిమాలను చేశాడు. ఆ మూడు సినిమాలు కూడా మహేష్ బాబుకి చాలా మంచి ఇమేజ్ తీసుకొచ్చి పెట్టాయి... ఏది ఏమైనా కూడా మహేష్ బాబు ఇమేజ్ కి తగ్గట్టుగా కథలు ఉన్నప్పుడే ఆయనతో సినిమాలు చేయాలి. అలా కాకుండా ఇష్టం వచ్చిన కథలతో సినిమాలు చేస్తే మాత్రం ఆ సినిమాలు డిజాస్టర్ అవుతాయనిడానికి చాలా సినిమాలను మనం ఉదాహరణకు తీసుకోవచ్చు...

## ఇండియాలో నెంబర్ వన్ డైరెక్టర్ రాజమౌళి కాదా..?

**నితీష్ తివారీనే ఇప్పటికీ నంబర్ 1**



ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ఎవ్వరికి సాధ్యం కానీ రీతిలో గొప్ప సినిమాలను చేస్తూ ముందుకు దూసుకెళ్తున్న దర్శకులలో రాజమౌళి మొదటి స్థానం లో ఉన్నాడు. ఇక బాలీవుడ్ డైరెక్టర్లు సైతం పాన్ ఇండియా సినిమాలను చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు... నితీష్ తివారీ లాంటి దర్శకుడు గతంలో అమీర్ ఖాన్ తో చేసిన 'దంగల్' సినిమా గొప్ప విజయాన్ని సాధించింది. అయితే ఈ సినిమా 2000 కోట్లకు పైన కలెక్షన్స్ ని కొల్లగొట్టింది. ప్రస్తుతం ఆయన రామాయణం అంటూ మరో సినిమాని స్టార్ట్ చేశాడు. అయితే ఈ సినిమా హిందువుల పవిత్ర గ్రంథం అయిన రామాయణాన్ని బేస్ చేసుకుని తెర్కెక్కుతూ ఉండటం విశేషం... ఇందులో రణ్బీర్ కపూర్ రాముడిగా నటిస్తుంటే, సాయి పల్లవి సీతకి నటిస్తోంది. కన్నడ స్టార్ హీరో యశ్ రావణాసూరుడిగా నటిస్తున్నాడు...ఇక ఏది ఏమైనా కూడా ఈ సినిమాతో నితీష్ తివారీ మరోసారి తన స్టామినా ఏంటో చూపించాలనే ప్రయత్నంలో ఉన్నాడు. ఇక రాజమౌళి చేసిన 'బాహుబలి 2' సినిమా 1800 కోట్లకు పైన కలెక్షన్స్ ని రాబట్టింది. అయినప్పటికి నితీష్ తివారీ రికార్డును బ్రేక్ చేయలేకపోయాడు.
కాబట్టి ఇండియాలో ప్రస్తుతం నితీష్ తివారీ నెంబర్ వన్ డైరెక్టర్ గా కొనసాగుతున్నాడు. ఇక రాబోయే సినిమాలతో వీళ్ళిద్దరిలో ఎవరు సూపర్ సక్సెస్ ని సాధిస్తారు అనేది తెలియాల్సి ఉంది...ఇక నితీష్ తివారీ సినిమాలు చాలా సెన్సిబుల్ గా ఉంటాయి. రాజమౌళి సినిమాలు విజువల్ వండర్ గా తెరకెక్కిస్తు ఉంటాడు. ఇద్దరి సినిమాలు డిఫరెంట్ పంథాలో సినిమాలు రావడం అనేది మనం చూశాం...ఇక వీళ్ళిద్దరిలో ఎవరు టాప్ డైరెక్టర్ గా ఎదుగుతారు. వీళ్లను కాదని ఇంకా వేరే దర్శకులు ఎవరైనా ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేసే సినిమాలను తీస్తారా అనే అభిప్రాయాలైతే వ్యక్తం అవుతున్నాయి... ప్రస్తుతం వీళ్లిద్దరితో పాటు సుకుమార్, ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగ లాంటి దర్శకులు సైతం బ్లాక్ బాస్టర్ సక్సెస్ లను సాధించడంలో ముందు వరుసలో ఉన్నారు. ఇక వీళ్ళు సైతం ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేసే అవకాశాలైతే పుష్కలంగా ఉన్నాయి. మరో రెండు సంవత్సరాలు గడిస్తే గాని వీళ్లలో నెంబర్ వన్ డైరెక్టర్ ఎవరు అనేది చెప్పడం చాలా కష్టంతో కూడుకున్న పని అనే చెప్పాలి...

## అమీర్ ఖాన్ కథ ముగిసినట్టేనా..?

- **ఆయనకి అంత భయం ఎందుకు..?**

బాలీవుడ్ ఇండస్ట్రీలో ఖాన్ త్రయానికి చాలా మంచి గుర్తింపైతే ఉంది. వాళ్ళ నుంచి ఏ సినిమాలు వచ్చినా కూడా ఆ సినిమాలన్నీ సూపర్ సక్సెస్ ని సాధిస్తూ ముందుకు దూసుకెళ్తాయని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ కొన్ని సంవత్సరాల పాటు ఇండస్ట్రీని ఏలారు...ఒకప్పుడు ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేయాలంటే ఈ ముగ్గురికే సాధ్యమయ్యేది. అలాంటి హీరోలు ఇప్పుడు చేస్తున్న సినిమాలతో ఏ మాత్రం సక్సెస్ లను సాధించలేకపోతున్నారు. ఇక అమీర్ ఖాన్ ఈ మధ్యకాలంలో సినిమాలను కూడా చేయడం లేదు. కారణం ఏంటి అంటే ఆయన నుంచి వచ్చిన సినిమాలు ప్రేక్షకులను మెప్పిస్తాయా? లేదా అనే ఒక డైలామాలో తను పడిపోయాడు. తెలుగు సినిమా హీరోలందరు ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేస్తూ ముందుకు దూసుకెళ్తుంటే వాళ్లని బ్రేక్ చేయగలిగే సినిమా నేను చేస్తానా లేదా అనే భయంతోనే ఆయన సినిమాలు చేయడం లేదు. తన సినిమా ఫ్లాప్ అయిన లేదంటే తెలుగు హీరోల రికార్డు లను తన సినిమా బ్రేక్ చేయలేకపోయిన దానిని పెద్ద ఓటమిగా భావించే అవకాశాలైతే ఉన్నాయి.
అందుకోసమే అతను సినిమాలను చేయకుండా మంచి కథల కోసం వెతుకుతున్నాడు. దానికోసమే చాలా సంవత్సరాల పాటు ఎదురుచూస్తున్నాడు. ఇక తెలుగు సినిమా డైరెక్టర్ అయిన వంశీ పైడిపల్లితో తను సినిమా చేయబోతున్నాడు అంటు గతంలో వార్తలు వచ్చినప్పటికి అవి కార్యరూపం దాల్చలేదు. ఆయన తెలుగు డైరెక్టర్లతోనే సినిమాలు చేస్తున్నాడా? లేదంటే కొత్త దర్శకులకు ఏదైనా అవకాశం ఇచ్చే ఛాన్సులు ఉన్నాయా? స్టార్ డైరెక్టర్లతోనే సినిమాలు చేయాలనుకుంటున్నాడా మొత్తానికైతే తను ఏ కాన్సెప్ట్ తో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నాడు అనే విషయం మీద సరైన క్లారిటీ రావడం లేదు.మొత్తానికైతే అమీర్ ఖాన్ కి మనం చేసే సినిమాలు సక్సెస్ అవుతాయా? లేదా అనే ఒక భయమైతే పట్టుకుంది. మరి ఆ భయాన్ని పారద్రోలుతూ అతను గొప్ప సినిమా ఎప్పుడు చేయగలుగుతాడు అనేది తెలియాలంటే మరి కొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే...



## దుబాయ్ లో మెగాస్టార్.. ఏంటి కథ?



మెగాస్టార్ చిరంజీవి రీసెంట్ గా మన శంకర వరప్రసాద్ గారు మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఆ సినిమాతో ఇప్పుడు థియేటర్స్ లో ఓ రేంజ్ లో సందడి చేస్తున్నారు. భోళా శంకర్ తర్వాత ఇప్పుడు మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతో కమ్ బ్యాక్ ఇచ్చారని చెప్పాలి. దీంతో ఆయన హ్యాపీ మోడ్ లో ఉన్నారు. రీసెంట్ గా సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ జరుపుకున్నారు. మూవీ టీమ్ తో తన ఆనందాన్ని పంచుకున్నారు. సినిమా పోస్ట్ ప్రమోషన్స్ లో కూడా పాల్గొన్నారు. అదే సమయంలో రీసెంట్ గా చిరు.. దుబాయ్ కు వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ తన లైనప్ లో ఉన్న మూవీపై ఫుల్ గా చర్చలు జరుపుతున్నారని సమాచారం. అయితే మెగాస్టార్.. ఇప్పుడు బాబీ కొల్లితో వర్క్ చేసేందుకు రెడీ అవుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వారిద్దరి కాంబినేషన్ లో వచ్చిన వాల్తేరు వీరయ్య మూవీ సూపర్ హిట్ గా నిలవగా.. ఇప్పుడు మరోసారి కలిసి వర్క్ చేస్తున్నారు చిరు, బాబీ. కొన్ని రోజుల క్రితం మూవీ అనౌన్స్మెంట్ రాగా.. అప్పుడే భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. మరికొద్ది రోజుల్లో మూవీ పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు రీసెంట్ గా వార్తలు వచ్చాయి. కానీ ఎలాంటి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. అయితే ఇప్పుడు ఫైనల్ స్క్రిప్ట్ పై చిరు, బాబీ దుబాయ్ లో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మెగాస్టార్ సూచనల మేరకు బాబీ, ఆయన టీమ్ స్క్రిప్ట్ లో ప్రస్తుతం కొన్ని మార్పులు చేస్తున్నట్లు సమాచారం. అంతే కాదు చిరంజీవి సూచనల మేరకు సీనియర్ రచయిత కోన వెంకట్.. బాబీ టీమ్ రాసుకున్న స్క్రిప్ట్ ను పర్యవేక్షిస్తున్నారట. మరో రోజులో మొత్తం కంప్లీట్ అవ్వనుందట. ఇక స్క్రిప్ట్ వర్క్ అయిపోతే.. ఫిబ్రవరిలో గ్రాండ్ గా సినిమాను బాబీ కొల్లి లాంచ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మార్చిలో రెగ్యులర్ షూటింగ్ ను మొదలుపెట్టనున్నారట. ఇప్పటికే చిత్రీకరణకు ప్లేసెస్ కూడా వెతుకుతున్నట్లు సమాచారం. ఏదేమైనా కూతురి సెంటిమెంట్ తో ముడిపడిన యాక్షన్ ఎంటర్టైనర్ గా మూవీ ఉండనుందని సినీ వర్గాల్లో టాక్. అదే సమయంలో సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ స్థాయిలో నిర్మించేందుకు సిద్ధమవుతోంది. ఆస్కార్ అవార్డు విన్నర్, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించనున్నారు. మూవీలో చిరంజీవికి కూతురిగా ఓ యంగ్ అప్ కమింగ్ హీరోయిన్ ను ఎంపిక చేయనున్నారని వార్తలు వస్తున్నాయి. మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ గెస్ట్ రోల్ లో కనిపిస్తారని కూడా ఇటీవల టాక్ వినిపించింది.



## గ్రీన్ చీరలో మెరిసిన టాలీవుడ్ రైజింగ్ బ్యూటీ నువేక్ష

టాలీవుడ్ యువ నటి నువేక్ష గురించి మీరు అందించిన సమాచారం చాలా ఆసక్తికరంగా ఉంది. ఆమె శైలిని మరియు కెరీర్ ప్రయాణాన్ని ప్రతిబింబించేలా ఒక చక్కని వార్తా కథనం ఇక్కడ ఉంది:
హైదరాబాద్:
టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటున్న యువ నటి నువేక్ష. గ్లామర్‌కు గ్రేస్‌ను జోడించి, తనదైన శైలిలో దూసుకుపోతున్న ఈ అందాల భామ, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి.

**సూర్యాస్తమయ వేళ.. సంప్రదాయ అందం!**

తాజా ఫోటోషూట్‌లో నువేక్ష పచ్చని చీర, ఎరుపు రంగు బ్లౌజ్‌లో మెరిసిపోయింది. సూర్యాస్తమయ సమయంలో నీటి తీరంలో నిలబడి, నుదిటిపై చేయి పెట్టుకుని ఆమె ఇచ్చిన స్టిల్ నెటిజన్లను కట్టిపడేస్తోంది. సంప్రదాయ దుస్తుల్లో కూడా ఆధునిక ఆకర్షణను (Modern Appeal) ఎలా పండించవచ్చో నువేక్ష మరోసారి నిరూపించింది. ఆమె చిరునవ్వు, ఆత్మవిశ్వాసం ఈ ఫోటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**మోడలింగ్ నుండి వెండితెర వరకు..**

1999 ఆగస్టు 1న బెంగళూరులో జన్మించిన నువేక్ష, తన కెరీర్‌ను మోడలింగ్‌తో ప్రారంభించింది. ర్యాంప్ వాక్‌లు, బ్రాండ్ షూట్‌లతో గుర్తింపు పొందిన ఈ భామ, 2021లో 'అతిథి దేవోభవ' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆది సాయికుమార్ సరసన నటించిన ఈ చిత్రంలో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

**సోషల్ మీడియా క్రేజ్.. భవిష్యత్తు ప్రాజెక్టులు**

సినిమాలతోనే కాకుండా, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో నువేక్షకు భారీ ఫాలోయింగ్ ఉంది. ముఖ్యంగా ఆమె చేసే శారీ ఫోటోషూట్‌లు యువతను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం కొన్ని క్రేజీ ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయని సమాచారం. ఆమె చూపిస్తున్న డెడికేషన్ మరియు స్టైల్ చూస్తుంటే, త్వరలోనే టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## సినీ నటుడు అల్లరి నరేశ్ ఇంట విషాదం

సినీ నటుడు అల్లరి నరేశ్ ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆయన తాత ఈవీవీ సత్యనారాయణ తండ్రి ఈవీవీ వెంకట్రావు (90) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న వెంకట్రావు మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నిడదవోలు మండలం కోరుమామిడిలో ఈరోజు సాయంత్రం 4 గంటలకు ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన సతీమణి వెంకటరత్నం 2019లో మరణించారు. వెంకట్రావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ఈవీవీ సత్యనారాయణ 2011 జనవరి 21న మృతి చెందిన విషయం తెలిసిందే.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com